
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 6 ఆగస్టు 2024 | 5



స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 5 : ఎగువ నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 8.30 అడుగల నుంచి 9 అడుగులకు పెరిగింది. ఆదివారం రాత్రి 9 గంటలకు 8.30 అడుగులుగా నమోదైన నీటిమట్టం 6 గంటల పాటు నిలకడగా కొనసాగి సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పెరిగింది. కాటన్ బ్యారేజ్ నుంచి 6,33,226 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ఎగువున భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 8 గంటలకు 35.60 అడుగులుగా నమోదైంది.



కలెక్టరేట్ ముట్టడి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 5 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుం చి స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని వాటిని నిలుపుదల చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ,జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారన్నారు.అరకొర వేతనాలతో ప్రభుత్వ శాఖల్లో అనేక ఏళ్ళుగా పనిచేస్తున్న వారిని వేధింపులకు గురిచేయడం..బలవంతంగా తొలగించడాన్ని ఖండించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్‌మూర్తి, సహాయ కార్యదర్శి పూర్ణిమారాజు, జిల్లా కమిటీ నాయకులు బి.పవన్, పి.తులసి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఏపీ అంగన్‌వాడీ అధ్యక్షురాలు సిహెచ్ మాణిక్యాంబ, వై.బేబీరాణి, ఎం.వెంకటలక్ష్మి, మధ్యాహ్నభోజన పథకం కార్మికులు చిట్లా బేబి,వెలుగు యానిమేటర్స్ ప్రమీళ, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లతో సీఎం సమీక్ష



రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా స్వామ్యంలో తప్పుచేయాలంటే భయపడేలా మన పాలన ఉండాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజధాని వెలగపూడిలో సోమవారం జరిగిన జిల్లా కలెక్టర్లు,ఎస్పీల తొలి సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా అధికార యంత్రాంగానికి విజన్ 2047పై చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు మంచి పాలన అందించాలన్నారు. తమ ప్రభుత్వం రాజకీయంగా అధి కారులను బలి చేయదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని, వారి అవసరాలు, సమస్యలు ఏంటో తెలుసుకోవాలని,అ న్నివర్గాల ప్రజల సంక్షేమ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయా లన్నారు. ప్రభుత్వం మీద ఎవరైనా ఫేక్ ప్రచారం చేస్తే అధికారులు ఖండించాలన్నారు. ఎక్కడైనా చెడు జరిగినట్టు తెలిస్తే ఆధారాలతో వివరించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్ పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు,మునిసిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ వర్చువల్ విధానం లో సదస్సులో పాల్గొన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ ఒక నివేదిక తీసుకుని వెళ్లారు. కానీ అక్కడ రాష్ట్ర స్థాయి అధికారులు ఆయా శాఖల మీద సమీక్ష చేశారు. మంగళవారం అంటే నేడు జిల్లాల వారీగా సమీక్షించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అన్ని శాఖల మంత్రులు పాల్గొన్నారు.

రాజధాని వెలగపూడిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

పోలీస్..బది లీలలు!

- ఉత్తర్వుల్లేవ్.. నోటిమాటతో పోస్టింగ్‌లు
- జిల్లాలో డీఎస్పీ, సీఐల బదిలీల్లో విచిత్రం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో డీఎస్పీలు,సీఐల బదిలీల్లో విచిత్ర పరిస్థితి కానవస్తోంది. ఖాళీ అయిన సీటులో ఎవరు వచ్చి కూర్చుంటారో అనే ఆందోళనతో మౌఖిక ఆదేశాలతో కూడా హుటాహుటిన బాధ్యతలు స్వీకరించేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఐదుగురు సీఐలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. కొవ్వూరు టౌన్, రూరల్, రాజమహేంద్రవరం త్రీటౌన్, సీసీఎస్-1, 2 సీఐలను బదిలీ చేస్తూ ఈ నెల 2న ఉత్తర్వులు వెలువడ్డాయి. త్రీటౌన్ సీఐగా జి.మధుబాబును నియమించారు.కానీ ఆయన పోస్టింగ్‌ని హోల్డ్‌లో పెట్టారు. ఇంతలో త్రీటౌన్ సీఐగా అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. అప్పారావు ఎస్పీ మౌఖిక ఆదేశాలతో జాయిన్ అయ్యారని.. రాతపూర్వక ఆదేశాలు ఇంకా ఇవ్వలేదని తెలుస్తోంది. త్రీటౌన్ నుంచి వీఆర్‌కి వెళ్లిన ఎస్.పసన్న వీరయ్య గౌడ్ రాజానగరం, అక్కడి సీఐ కాశీవిశ్వనాథ్ గోకవరం,త్రీటౌన్ ఇచ్చినట్టే ఇచ్చి పక్కన పెట్టిన మధుబాబుకు ప్రకాశ్ నగర్, వన్‌టౌన్ బాజీలాల్‌కి డీవోలు అయ్యాయని అంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎవరికీ లిఖిత ఆదేశాలు లేవు. ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేశారు. వీఆర్‌కి పంపిన వాళ్లు సీటు సంపాదించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఎవరు ఏ స్టేషన్‌లో కుదుట పడతారో తెలియని అయోమయం నెలకొంది. రెండు మూడు రోజుల్లో సీఐల బదిలీలపై అధికారిక ఉత్తర్వులు వెలువడతాయని చెబుతున్నారు.జిల్లా నుంచి ఐదుగురు డీఎస్పీలకు ఇటీవల స్థాన చలనం కల్పించారు.సౌత్ జోన్ అంబికా ప్రసాద్, సెంట్రల్ జోన్ విజయపాల్, క్రైమ్స్ శ్రీనివాసమూర్తి, దిశ ఆదినారాయణలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈస్ట్‌జోన్ కిషోర్ బాబును ఏసీబీకి పంపించారు.ఈ నేపథ్యంలో ఆయా జోన్లకు డీఎస్పీలను కేటాయిస్తూ త్వరలో ఆదేశాలు వస్తాయని చెబుతున్నారు.ఈ లోపుగా ఎవరి 'దారి'లో వారు వెళుతున్నారు. సీఐల బదిలీల క్రతువు ముగిసిన తర్వాత ఎస్ఐల వంతు వచ్చే అవకాశం ఉంది.ఏదేమైనా ఈ నెలఖరు నాటికి ఆయా స్టేషన్లలో నాలుగో సింహాలు ఎవరనే విషయంపై స్పష్టత రానుంది.

త్రీటౌన్ సీఐగా అప్పారావు



రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ సీఐగా వి.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ఇక్కడ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఎస్ఈ బీకి వెళ్లారు. ప్రస్తుతం ఏలూరు ఏంజ్ వీఆర్‌లో ఉన్న ఆయనను జిల్లా వీఆర్‌కి కేటాయించారు.

అన్న క్యాంటీన్లు విడుదల



- 2014లో పథకం ఆరంభం
- 2019 వరకూ ఆకలి తీర్చాయి
- ప్రభుత్వం మారడంతో తాళాలు
- పేదల కడుపుపై కొట్టిన జగన్
- భవనాలు ఐదేళ్లూ మూతే
- కూటమి రాకతో పునఃప్రారంభం
- ఆగస్టు 15 నుంచి ఆరంభం
- జిల్లాలో ఐదు ఏర్పాటు
- రాజమహేంద్రిలో మూడు
- కొవ్వూరు, నిడదవోలులో ఒక్కొక్కటి
- శరవేగంగా సాగుతున్న పనులు

ఐదేళ్లుగా వైసీపీ తాళాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం సిటీ

అన్న క్యాంటీన్లకు స్వాతంత్ర్యం వచ్చేసింది..ఐదేళ్ల తరువాత విడుదలయ్యాయి.. గత టీడీపీ ప్రభుత్వంలో పేదల కడుపునింపిన అన్న క్యాంటీన్లకు వైసీపీ ప్రభుత్వంలో తాళాలు పడ్డాయి..ఐదేళ్లూ ఒక్క అన్న క్యాంటీన్ తెరవ లేదు. కక్ష సాధింపు దోరణితో మూసివేశారు. టీడీపీ నాయకులు అక్కడక్కడా అన్న క్యాంటీన్ల అంటూ బయటకొచ్చినా కేసులు పెట్టి వేధించారు. ప్రభుత్వం మారడంతో అన్న క్యాంటీన్లు విడుదలయ్యాయి.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజునే మళ్లీ తెరుచుకోనున్నాయి.

2014లో అన్న క్యాంటీన్లు ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు రూ.5లకే పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం సిద్ధం చేసింది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు చాలా ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. అప్పట్లో వీటి నిర్మాణానికి ఒక్కొక్క దానికి సుమారు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చుచేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 వరకు పని చేశాయి. లక్షలాది మంది ఆకలి బాదలు తీర్చాయి. అయితే ఆ తరువాత జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మూతపడ్డాయి. ఐదేళ్లూ పాటు అన్న క్యాంటీన్లకు తాళాలు వేసే ఉంచారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ తాళాలు తెరుచుకున్నాయి. ఈనెల 15వతేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం క్యాంటీన్లు సిద్ధం అవుతున్నాయి.

వైసీపీ పాలనలో మూత

రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల కోసం ఈ క్యాంటీన్లను ప్రారంభించిన సంగతి తెలిసిందే. మార్కెట్‌లో కనీసం రోడ్డు పక్క దుకాణంలో ఇడ్లీ తినాలంటే కనీసం రూ.20 ఉండవలసిందే. ఇదే ఓ మోస్తరు హోటల్‌లో రూ.35కు పైనే. నిత్యావసరాల ధరలు పెరగడంతో ఇష్టానుసారం ధరలు పెంచేసిన సంగతి తెలిసిందే.పట్టెడన్నం తినాలంటే కనీసం రూ.100 ఉండాలి.ఇ టువంటి పరిస్థితులను గమనించిన టీడీపీ అధినేత 2019 వరకూ రాష్ట్రంలో పేదల కోసం అన్నక్యాంటీన్లు నిర్వహించారు. కేవలం రూ.5కే టిఫిన్, లంచ్, డిన్నర్ కూడా కేవలం రూ.10లకే అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద, పేదలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, సాధారణ ప్రజల కు అందుబాటులో ఉండేవిధంగా అన్న క్యాంటీన్లు ఏర్పా టు చేసిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం అధికా రంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూసేశారు. భవనా లు కూలగొట్టాలని ప్రయత్నించారు. కానీ టీడీపీ పోరాడి నిలబెట్టింది. కూటమి అధికారంలోకి రావడంతో పేదలకు రూ.5లకే మళ్లీ కడుపు నింపనుంది. ఎన్నికలకు ముందే చంద్ర బాబు అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.దీనిలో భాగంగా ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించడానికి నిర్ణయం తీసుకున్నా రు.గత వైసీపీ హయాంలో పాడైన అన్నక్యాంటీన్లకు మళ్లీ మరమ్మతులు చేసి ముస్తాబు చేస్తున్నారు.ఈ నెల 10వ తేదీకి సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో ఐదు క్యాంటీన్లు

మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో ఇవి సిద్ధమవుతున్నాయి.రాజమహేంద్రవరంలో ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి వద్ద రూ.5.1 లక్షలతో మరమ్మతులు చేసి ముస్తాబు చేశారు.క్వారీ మా ర్కెట్‌లో రూ.7.9 లక్షలతో ముస్తాబు చేశా రు. ఆనం కళాకేంద్రం సమీపంలోని సుబ్రహ్మణ్య మైదానంలో రూ. 4.5 లక్షలతో ఖర్చుతో సిద్ధం చేశారు.కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రూ.2.8 లక్షలతో సిద్ధం చేస్తున్నారు. ఇది ఇంకా పూర్తి కాలేదు.నిడదవోలు ఐదో వార్డులోని పంగిడిరోడ్డులో రూ.6.25 లక్షలతో సిద్ధం చేస్తున్నారు.ఇది ఇంకా పూర్తి కాలేదు. కానీ 10వ తేదీకి అన్ని సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశా లు జారీ చేసింది. పనులు చురుగ్గా సాగుతున్నాయి.





డీజీపీని కలిసిన ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకాతిరుమలరావును తూర్పుగోదావరి ఎస్పీ నరసింహ కిశోర్ విజయవాడలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఎం చంద్రబాబు సమావేశానికి హాజరయ్యారు.

విలీన గ్రామాలకు ప్రత్యేకాధికారులు మార్పు

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 5 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదిత గ్రామాల ప్రత్యేకాధికారులను మార్పు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి డి రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ మండలం పరిధిలో గల తొర్రేడు,వెంకటనగరం, కాతేరు, కోలమూరు, హుకుంపేట, పిడింగొయ్యి, రాజవోలు, బొమ్మూరు, శాటిలైట్ సిటీతో పాటు కడియం మండలం పరిధి వేమగిరి గ్రామాలకు ప్రత్యేకాధికారిగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌ను నియమించారు. ఇక రాజానగరం మండల పరిధిలో గల చక్రద్వారబంధం, నామవరం గ్రామాలకు రాజమహేంద్రవరం ఆర్డీవో, పాలచర్ల, వెలుగుబంద గ్రామాలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఆర్‌సీసీ నియమించారు. కోరుకొండ మండల పరిధిలో గల గాడాల, నిడిగట్ల గ్రామాలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఓఎన్‌జీసీ, బూరుగుపూడి, మధురపూడి గ్రామాలకు డివిజనల్ పంచాయతీ అధికారి, ని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయా గ్రామాలన్నీ విలీన ప్రతిపాదనతో సుమారు 15 ఏళ్లగా ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. 2016-17 తెలుగదేశం ప్రభుత్వం హయాంలో ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో భారీమొత్తంలో అవకతవకలు జరిగిందనే ఆరోపణలు రావడంతో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అప్పటి కమిషనర్ విజయరామరాజును విలీన గ్రామాల ప్రత్యేకాధికారిగా నియమించారు. సుమారు 4 నెలల పాటు ప్రత్యేకాధికారిగా ఉన్నారు. నగరపాలక సంస్థ అధికారులకు పంచాయతీలపై అజమాయిషీ చేసే అధికారం లేదంటూ కొంతమంది కోర్టును ఆశ్రయించగా కమిషనర్‌ను తొలగించి.. ప్రత్యేకాధికారులను నియమించారు.

సోలార్.. బోరు..బోరు!



టీడీపీ సోలార్ పథకానికి వైసీపీ రివర్స్ గేర్

- విద్యుత్ ఆదాకు సోలార్ మోటార్లు
- గత టీడీపీ హయాంలో రైతు పథకం
- జిల్లాలో 3 వేల వరకూ ఏర్పాటు
- మరమ్మతులకు గురై మూలకు
- ఆ పథకాన్ని గాలికొదిలేసిన వైసీపీ
- కూటమి దృష్టి పెట్టాలంటున్నరైతన్న

పెరవలి, ఆగస్టు 5 : జగన్ ప్రభుత్వం సంక్షేమం ముసుగులో జనాన్ని మభ్యపెట్టింది.. గత ప్రభుత్వంలో దీర్ఘకాలికంగా ఆలోచించి రూపొందించిన పథకాలను అటకెక్కించింది.. అంతా తానే చేశారు.. చేస్తున్నానని చెప్పుకుంటూ వచ్చారు. ఎందుకంటే ఏ పథకం చూసినా జగన్ పేరే.. గత టీడీపీ ప్రభుత్వంలో సోలార్ మోటార్లు ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారం చేట్టిందో లేదో సోలార్ పథకానికి చెదలు పట్టింది.. వైఎస్సార్ జలసిరి పేరుతో కొత్త పథకం అమల్లోకి తెచ్చినా అది అంతంతమాత్రంగానే సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సంక్షేమ తెరతొలగింది. అసలు విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

బోరుమన్న పథకం..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతులకు సోలార్ మోటార్లు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలోనే 3 వేల మోటార్ల వరకూ ఉన్నట్టు సమాచారం. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిపై శ్రద్ధ చూపకపోవడంతో చాలా వరకు మూలకుచేరాయి.విద్యుత్ పొదుపు చేయాలనే ఉద్దేశంతో రైతులకు విరివిగా సోలార్ మోటార్లు ఏర్పాటు చేశారు. పథకం ఆరంభించిన మొదట్లో రైతులు వద్ద రూ. 55 వేలు కట్టించుకుని సోలార్ ప్లేట్లతో పాటు మోటార్‌ను అందజేశారు. బోరు మాత్రం మాత్రం రైతు వేయించుకునేవారు. పథకంలో భాగంగా కొంత మంది రైతులు ఈ మోటార్లు వేయించుకున్నారు. చాలా మం ది రైతులకు రూ.55 వేలు కట్టడం భారంగా మారడంతో ఆ పథకంలో మార్పులు చేశారు. రూ.25 వేలు చెల్లిస్తే రైతులు పొలంలో సోలార్ ప్లేట్‌లు బిగించడంతో పాటు ఉచితంగా బోరు కూడా వేసి మోటారు కూడా ఏర్పాటు చేసేలా పథకంలో మార్పులు చేశారు. దీంతో ఎక్కువ మంది రైతులు ఈ పథకంలో సోలార్ మోటార్లు వేయించుకున్నారు. ఈ మోటార్లు వేయడానికి కొన్ని సోలార్ కంపెనీలకు కాంట్రాక్ట్ ఇచ్చి ఐదేళ్ల పాటు వాటి నిర్వహణ బాధ్యతను అప్పగించారు.అప్పట్లో ఏర్పాటు చేసిన మోటార్లు కేవలం రెండు అంగులాలు మాత్రమే నీరు ఇస్తుండడంతో రైతులకు ఏ మాత్రం సరిపోయేది కాదు.విద్యుత్‌పై ఆధారపడిన మోటార్లు మూడు అంగులాలు, నాలుగు అంగులాలు నీరందిస్తూ ఉంటాయి. కేవలం డ్రిప్‌పై వ్యవసాయం చేసే వారికి మాత్రమే రెండు అంగులాలు మోటార్లు పనిచేస్తాయని చెబుతున్నారు.దీంతో రైతులు ఈ మోటార్లు వాడకం మానేసి విద్యుత్ మోటార్లు వైపు మొగ్గు చూపారు.

మూలకు చేరిన సోలార్ ప్లేట్లు..

చిన్న రైతులు మాత్రం ఈ మోటార్లపైనే ఆధారపడి వ్యవసాయం చేసేవారు.అయితే కాలక్రమంలో ఈ మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయించాలంటే మళ్లీ వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో రైతులు వాటిని నిర్లక్ష్యంగా వదిలివేశారు. తమ భూములకు నీరు కావాల్సి వస్తే పక్క రైతులపై ఆధారపడుతున్నారు. చాలా మంది రైతులు ఈ సోలార్ ప్లేట్లను అతి తక్కువ రేట్లకు విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం వాటిని తక్కువ రేటుకు ఇవ్వడం ఇష్టం లేక తమ పొలాల్లో అలాగే ఉంచారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు మళ్లీ సోలార్ విద్యుత్‌పై దృష్టి కేంద్రీకరించడంతో రైతులు ఆశలు చిగురిస్తున్నాయి. తమ మోటార్లను ప్రభుత్వమే బాగు చేయించి తమకు నీరు వచ్చేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ సోలార్‌విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి రైతులకు ప్రభుత్వమే సొమ్ములు ఇచ్చేలా గతంలో చంద్రబాబు ఆలోచన చేశారు. ప్రస్తుతం అదే ఆచరణలోపెట్టి యూనిట్‌కు ఇంత రేటు చొప్పున తమకు చెల్లిస్తే ఎంతో కొంత ఆదాయం వస్తుందని రైతులు అంటు న్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతుల పొలాల్లో వృథాగా ఉన్న ఈ సోలార్ ప్లేట్లు ఉపయోగపడే విధంగా చేయాలని పలువురు కోరుతున్నారు.

సోలార్ మోటారు పని చేయడం లేదు..



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నా పొలంలో సోలార్ మోటారు ఏర్పాటు చేయించా. రూ.25 వేలు ప్రభుత్వానికి చెల్లించడంతో ప్లేట్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా బోరు వేసి మోటారు ఏర్పాటు చేశారు. కొంత కాలం మోటారు బాగానే పని చేసింది. అనంతరం మోటారు స్టార్టర్ పనిచేయలేదు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం అది నిరూపయోగంగా ఉంది. ప్రభుత్వమే పరిష్కారం చూపాలి.- **నందమూరి రామారావు, రైతు, తీపర్రు**



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అధికారులు


పీజీఆర్ఎస్‌లో 150 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 5 : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 150 అర్జీలను అందించారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా అధికారు లంతా అందుబాటులో ఉన్నారు.ధవళేశ్వరానికి చెందిన పల్నాటి పార్వతి దేవి దివ్యాంగురాలు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ ప్రత్యేక వైద్య అవసరాల దృష్ట్యా రూ.15 వేలకు పెంచాలని అర్జీపెట్టుకుంది. జిల్లాలో పలు మండలాలకు చెందిన ప్రజలు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రహదారులు, డ్రైనేజీ సమస్యలతో కూడిన అర్జీలు అందించారు.రెవెన్యూ విభాగానికి 42, పీఆర్‌కు 26,హోం శాఖకు 25, వైద్య ఆరోగ్యశాఖకు 16, మునిసిపాలిటీకి 10, ఇతర శాఖలకు 41 అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి జేసీ నరింహులు తెలిపారు. మొత్తం 139 ఆన్‌లైన్‌లో, 11 అర్జీలు ఆఫ్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసల్ సిస్టం(మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మొత్తం 27 అర్జీలను స్వీకరించారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి తగు సూచనలిచ్చారు. ఫిర్యాదును ఏ అధికారికి అయితే కేటాయించారో వారే సీఐ, ఎస్ఐ సమక్షంలో ఫిర్యాదుదారుతో మాట్లాడి చట్ట ప్రకారం సత్వర పరిష్కారం చూపాలని ఆదేశాలిచ్చారు. కుటుంబ సమస్యలకు సంబంధించి ఫిర్యాదుదారులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తగిన కౌన్సెలింగ్ కోసం పంపించాలని సూచించారు.

గోదారి గట్టుపై సెట్టేది!



ఈ చెట్టుకు సెట్‌లో ఒక స్థానం ఉంది.. ఈ చెట్టు కింద సెట్ వేశారా.. ఆ సినిమా సూపర్ హిట్.. ఈ చెట్టుకు మరో పేరుంది.. అదే సినిమా చెట్టు .. ఈ చెట్టు కింద ఇప్పటి వరకూ సుమారు 300 చిత్రాలు తీశారు.. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చెట్టు సోమవారం నేల వాలింది.. సినిమా సెట్‌లో జ్ఞాపకంగా మారింది.

- మెయిన్‌లో

ఘనంగా ప్రారంభమైన సత్యదేవుడి ఆవిర్భావ వేడుకలు


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

అన్నవరం, ఆగస్టు 5: రత్నగిరివాసుడైన సత్యదేవుని క్రోధి నామ సంవత్సర 134వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు అనివేటి మండపంలో ప్రత్యేక వేదికపై స్వామి ,అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, జపాలు, మంటపారాధనలు, నవగ్రహ జపాలు, చండీ పారాయణ, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టారు. పండితులకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ దీక్షావస్త్రాలను అందజేశారు.

నేడు సత్య విదియ: స్వామివారు స్వయం భువునిగా 1891 ఖర నామ సంవత్సరంలో శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భవించారు. దీంతో శ్రావణ శుద్ధ విదియను సత్య విదియగా పిలుస్తారు. మంగళవారం వేకువ జామున రెండు గంటలకు సుప్రభాత సేవ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి 10 గంటలకు స్వామి, అమ్మవార్లను వెండి రథంపై ఊరేగిస్తారు. రాత్రి 7.30 గంటలకు కొండ దిగువన వెండి గరుడ వాహనంపై వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం జరుగుతుంది.



వేద పండితులకు దీక్షా వస్త్రాలు అందజేసి పూజల్లో పాల్గొన్న చైర్మన్ రోహిత్


మంత్రి సుభాష్ తల్లిదండ్రులతో సంప్రోక్షణ పూజలు చేయిస్తున్న అర్చకస్వాములు

భీమేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ పూజలు

▸▸ రేపటి నుంచి భక్తులకు యథావిధిగా భీమేశ్వరస్వామివారి దర్శనం

ద్రాక్షారామ, ఆగస్టు 5: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మూలవిరాట్ సంరక్షణ, అభివృద్ధి పనులను కేంద్ర పురావస్తు శాఖ పూర్తి చేసిన నేపథ్యంలో సోమ, మంగళవారాల్లో సంప్రోక్షణ పూజలు జరిపి బుధవారం ఉదయం 11 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పరిషత్, కుచ్చత్రయం, మంటపారాధన, రుత్విక్‌వరుణలు, దీక్షాధారణ జరిగాయి. మధ్యాహ్నం కృష్ణయజుర్వేద పారాయణ, గణపతి హోమం, వాస్తు హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు పూజలను జరిపించగా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో పీటీవీ సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్ఆర్‌కే గోపాల్‌బాబు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టీడీపీ నాయకుడు పెంకె సాంబశివరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



'లోవ' హుండీల ఆదాయం రూ.53.61 లక్షలు

తుని రూరల్, ఆగస్టు 5: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారికి భక్తులు కానుల వర్షం కరిపించారు. ఎన్నడూ లేనంతగా ఆషాఢ మాసం 30 రోజుల్లో అమ్మవారికి రూ.53,61,960 ఆదాయం సమకూరింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ప్రత్యేక అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి కానుకలను లెక్కించారు. ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అధిక ఆదాయం వచ్చిందని ఈవో విశ్వనాథరాజు తెలిపారు.


హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది





గొల్లప్రోలులో ఆయ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ట్రైలర్‌ను లాంచ్ చేస్తున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్. నిర్మాత బన్నీ వాసు

గొల్లప్రోలులో 'ఆయ్'

సందడిగా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్

ఆకట్టుకున్న ట్రైలర్

అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమా: నిర్మాత బన్నీవాసు

గొల్లప్రోలు, ఆగస్టు 5: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సినిమాల సందడి ప్రారంభమైంది. గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కన్వెన్షన్‌లో జీఏ2 పిక్చర్స్ పతాకంపై తెరకెక్కిన 'ఆయ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ సోమవారం జరిగింది. మెగా నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలుగా నార్నే నితిన్, నయన్‌సారిక హీరో, హీరోయిన్లుగా నిర్మితమైన ఈ చిత్రం ట్రైలర్‌ను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు లాంచ్ చేశారు. గ్రామీణ వాతావరణంలో అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా వినోదాత్మకంగా చిత్రాన్ని నిర్మించామని, ఈ నెల 15న విడుదలవుతుందని నిర్మాత బన్నీవాసు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు పిఠాపురం హాట్ టాపిక్‌గా మారిందని, అందుకే ఇక్కడ ప్రీ రిలీజ్ ఈవెంట్ చేశామని... సినిమా హిట్ కావడం పక్కా అన్నారు. ట్రైలర్‌ను లాంచ్ చేసిన వర్మ, శ్రీనివాసరావు మాట్లాడుతూ పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం సినిమా వేడుకలకు వేదిక కావడం ఆనందకరమైన విషయమన్నారు. హీరో, హీరోయిన్లు, ఇతర నటులు స్టెప్పులు వేసి ప్రేక్షకులను అలరించారు. ఆయ్ ... మేం ఫ్రెండ్సండి ట్యాగ్‌లైన్‌తో ఉన్న ఈ సినిమాకు అంజి.కె.మణిపుత్ర దర్శకత్వం వహించారు. విద్యా కొప్పినీడి, అంకిత్, కసిరెడ్డి, ఎం.స్వామి తదితరులు పాల్గొన్నారు.


డ్యాన్స్ చేసి ప్రేక్షకులను అలరించిన హీరో నితిన్, హీరోయిన్ నయన్‌సారిక

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని 'ఆయ్' సినిమా యూనిట్ సందర్శించింది. చిత్రం విజయవంతం కావాలని కోరుతూ కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు పూజలు చేశారు. నిర్మాత బన్నీ వాసు, హీరో, హీరోయిన్లు నార్నే నితిన్, నయన్‌సారిక తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గింది... పంటు కదిలింది

అంతర్వేది, ఆగస్టు 5: ఇటీవల వచ్చిన వరదలకు సుమారు పది రోజులకు పైగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి నుంచి నర్సాపురం పంటుపై రాకపోకలకు అంతరాయం కలిగింది. సఖినేటిపల్లిరేవులో వరద ప్రవాహం తగ్గింది. దీంతో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తున్నట్టు పంటు నిర్వాహకులు తెలిపారు.


పంటుపై రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

వలకు చిక్కిన 'శీలావతి'

16 కిలోలు రూ.3,200కి విక్రయం

మోతుగూడెం, ఆగస్టు 5: మోతుగూడెం పరిధిలోని మంగంపాడు వద్ద సీలేరు నదిలో బెంగాలీ మత్స్యకారుడు కేనా సోమవారం వేటకు వెళ్లాడు. అతని వలకు శీలావతి జాతికి చెందిన చేప చిక్కింది. 16 కిలోల బరువున్న దీనిని మోతుగూడెం మార్కెట్లో రూ.3,200కు విక్రయించాడు.



ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలపై దృష్టి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, మహిళల హక్కులు, మౌలిక సదుపాయాల కల్పన, వివిధ పథకాలపై ప్రజలను చైతన్యం చేసే దిశలో భాగంగా హైకోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈనెల 15 లోపుగా క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన మహిళల హక్కులు, వారి ఆరోగ్య పరిరక్షణ, మానసిక రుగ్మతలు, వితంతువుల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ఆయా జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో రహదారి మార్గాలు సరిగాలేని కుగ్రామాల్లో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

ధవళేశ్వరం, ఆగస్టు 5: భార్య తలపై రాయితో కొట్టి ఆమె మరణానికి కారణమైన భర్త ధనాల మహేష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సీటీఆర్ఐకు చెందిన యర్నాకుల శ్యామల (24), ధవళేశ్వరానికి చెందిన మహేష్ 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ బాబు, పాప ఉన్నారు. బొమ్మూరులోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు పడుతుండడంతో చాలాసార్లు పెద్దలు నచ్చజెప్పి సమస్యను పరిష్కరించారు. శ్యామలపై అనుమానం పెంచుకున్న మహేష్ ఈ నెల 2వ తేదీ రాత్రి ఆమెతో గొడవ పడి సిమెంటు రాయితో తలపై కొట్టి పారిపోయాడు. తలపగిలి రక్తం వస్తుండడంతో చుట్టుపక్కల వారు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి తమ్ముడు మణికంఠ ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ బి.తులసీధర్ దర్యాప్తు చేపట్టి నిందితుడు మహేష్‌ను బొమ్మూరు టిడ్కో గృహాల వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

ఏపీ మల్లవరంలో ప్రబలిన విష జ్వరాలు

వంద మందికి పైగా జ్వరపీడితులు... పలువురికి డెంగ్యూగా గుర్తింపు

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 5: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరంలో విష జ్వరాలు ప్రబలాయి. గ్రామమంతా జ్వరంతో వణుకుతోంది. పదుల సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్న వారికి డెంగ్యూగా నిర్ధారణ కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

వాతావరణంలో మార్పుల ప్రభావంతో ఏపీ మల్లవరంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వారంలో సుమారు వంది మందికిపైగా జ్వరం, రొంప, దగ్గు, వంటి నొప్పులతో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. ప్రతి ఇంట్లోనూ కనీసం ఒకరు జ్వరంతో బాధపడటం గానీ, చికిత్స పొంది తేరుకోవడం గానీ జరిగిందని గ్రామస్తులు చెప్తున్నారు. జ్వరం రాగానే తీవ్రంగా నీరసం వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. జ్వరం, ఇతర లక్షణాలతో బాధపడుతున్న వారు ప్రైవేటుగా పరీక్షలు చేయించుకున్నారు. డెంగ్యూగా నిర్ధారణ అవుతుండడంతో కాకినాడ, పిఠాపురం ల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాకినాడ సర్పవరం-మాధవపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఏపీ మల్లవరం గ్రామానికి చెందిన 30 మంది డెంగ్యూతో బాధపడుతూ చికిత్స నిమిత్తం చేరారు. వీరిలో కొంతమంది డిశ్చార్జి కాగా ఇంకా 12మంది చికిత్స పొందుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారు ఏపీ నగరం, చేబ్రోలు పీహెచ్‌సీలకు, పిఠాపురం సీహెచ్‌సీకి వస్తున్నారు. పలువురు పిఠాపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం చేరారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి మందులు అందజేస్తున్నారు. అయితే ఇప్పటివరకూ ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదు.



కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో డెంగ్యూతో చికిత్స పొందుతున్న రాజేశ్వరి, సుధాకర్‌రెడ్డి

అన్న క్యాంటీన్లు సిద్ధం

ఈ నెల 15న తెరుచుకోనున్న 54 క్యాంటీన్లు ... పాతవి 51, కొత్తవి 3

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 5: జోన్-2 పరిధిలో 54 అన్న క్యాంటీన్లు ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి రానున్నాయని రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు తెలిపారు. జోన్-2లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విజయవాడ కార్పొరేషన్ పరిధిలో 4, కాకినాడ కార్పొరేషన్ పరిధిలో 5, ఏలూరు పరిధిలో 4, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 3, భీమవరం పరిధిలో 3, తాడేపల్లిగూడెం పరిధిలో 3, గుడివాడ పరిధిలో 2... వీటితో పాటుగా మరో 23 మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో ఒక్కొక్క అన్న క్యాంటీన్లు ఉన్నాయి. వీటిలో అమలాపురం, జంగారెడ్డిగూడెం, గొల్లప్రోలు ప్రాంతాల్లో మరో మూడు కొత్త క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా జోన్-2 పరిధిలోని 54 క్యాంటీన్లను ఆగస్టు 15 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం మూసివేయడంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారిపోయాయన్నారు. క్యాంటీన్లలోని కంప్యూటర్లు, ఫర్నిచర్ కూడా లేకపోవడంతో తిరిగి టీడీపీ ప్రభుత్వం భవనాల రిపేర్ల నిమిత్తం, ఫర్నిచర్, కంప్యూటర్ల కొనుగోలు నిమిత్తం నిధులు కేటాయించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే అన్న క్యాంటీన్లు తిరిగి తెరవడానికి ఏర్పాట్లు చేస్తోందని, క్యాంటీన్ల భవనాలకు మరమ్మతులు చేసి వాటిల్లో సౌకర్యాలు కల్పించేందుకు కోట్లు నిధులు విడుదల చేసిందని ఆర్డీ తెలిపారు. వీటికి ఆహారం సరఫరా చేయడానికి ఇటీవల ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచిందని, మొత్తం ప్రక్రియను వచ్చే నెల మొదటి వారంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. అన్న క్యాంటీన్ల వల్ల పేదవారికి ఉపయోగమే. వ్యాపారస్తులకు, పల్లెల నుంచి పనిమీద నగరాలకు, పట్టణాలకు వచ్చి వెళ్లే వారికి ఇవి చాలా ఉపయోగపడతాయి. బయట టిఫిన్ చేయడానికే రూ.30నుంచి రూ.80 అవుతోంది. రూ.5కే భోజనం అంటే చాలా మంచిది. కూలి పనులు చేసుకునే వారికి, చిన్న వ్యాపారస్తులకు అంతోఇంతో డబ్బులు కూడా ఆదా అవుతాయని నాగనరసింహారావు చెప్పారు.

తూరంగిలో 55.90 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కాకినాడ రూరల్, ఆగస్టు 5: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి నుంచి కొవ్వూరు వెళ్లే రోడ్డులో గల శుభం కౌంటీ సమీపంలో మూర్తిగారి లేఅవుట్‌లోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 55.90 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని మహేంద్ర లోడ్ కింగ్ ఆప్టిమాలో లోడింగ్ చేస్తుండగా పట్టుకున్నట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మమత తెలిపారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ సీఐ నాగరాజు, వీఆర్వో సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి దాడి చేశారన్నారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.2,54,345 ఉంటుందని కనకాల దుర్గారావు, అనపర్తికి చెందిన కోనాల ఆనందరెడ్డి ఇక్కడ అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వచేసినట్లు గుర్తించామని... స్పాట్‌లో ఉన్న అతని గుమస్తా కాజులూరుకు చెందిన కనకాల దుర్గారావును అదుపులోకి తీసుకుని ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించామన్నారు. ఆనందరెడ్డి, దుర్గారావులపై 6(ఎ) కేసుతో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశామని తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు అప్పగించామన్నారు.



ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎస్ఈగా తిలక్‌కుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈగా తిలక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాజమహేంద్రవరంలో డీఈ, ఈఈగా సేవలందించిన తిలక్‌కుమార్ పదోన్నతిపై ఏపీఈపీడీసీఎల్ కార్పొరేషన్ మేనేజరుగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. అటుపై రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రాజమహేంద్రవరం ఎస్ఈగా విధులు నిర్వహించిన టీవీఎస్ఎన్ మూర్తి పదోన్నతిపై సీజీఎంగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఎస్ఈ బాధ్యతలు స్వీకరించిన తిలక్‌కుమార్‌ను సోమవారం జిల్లా వినియోగదారుల మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజమహేంద్రవరంలో విశేషంగా సేవలందించిన తిలక్‌కుమార్ తిరిగి ఎస్ఈగా రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

తిలక్‌కుమార్‌ను సన్మానిస్తున్న గొట్టిముక్కల అనంతరావు



నాట్లేసిన ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జడ్డంగి నుంచి రాజవొమ్మంగి వెళ్తుండగా వట్టిగెడ్డ గ్రామ శివారులో రోడ్డు పక్కన పొలాల్లో వరినాట్లు వేస్తున్న రైతులు ఆమె కంటపడ్డారు. వెంటనే ఆమె కారు ఆపి పొలంలోకి దిగి రైతులతో కలిసి వరి నాట్లు వేశారు. కాసేపు వారితో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు కూడా వరి నాట్లు వేశారు.

...రాజవొమ్మంగి

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రభుత్వ మద్యం షాపు సిబ్బంది నలుగురిపై శాశ్వత వేటు

కొవ్వూరు, ఆగస్టు 5: ప్రభుత్వ మద్యం షాపులో బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వర్తించిన నలుగురు సిబ్బందిని శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్టు చాగల్లు డిపో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తరంగిణి తెలిపారు. కొవ్వూరు పెట్రోల్ బంకు వద్ద మద్యం దుకాణంలో నిర్వహించిన తనిఖీల్లో 79 మద్యం బాటిల్స్ స్టాక్‌లో రిజిష్టర్‌కు వ్యత్యాసం రావడంతో సేల్స్ సూపర్‌వైజర్ కె.సత్తిపండు, సేల్స్‌మేన్‌లు బి.రాహుల్, ఎన్.స్వామిలను తొలగించామని, స్థానిక బస్టాండ్ సెంటర్ మద్యం షాపులో విధులు నిర్వహించే చిన్నబాబు పెట్రోల్ బంకు వద్ద ఉన్న మద్యం షాపులో నుంచి బీరు బాటిల్స్ తీసుకురావడంతో విధుల నుంచి శాశ్వతంగా తొలగించామన్నారు.

ఏజెన్సీ సమాచారం



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే శిరీష దేవి

గర్భిణులు మానసికంగా దృఢంగా ఉండాలి : ఎమ్మెల్యే

రాజవొమ్మంగి ఆగస్టు 5: గర్భిణులు మానసికంగా దృఢంగా ఉంటేనే శిశువు పుట్టిన వెంటనే పాలు ఇవ్వగలరని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. శిరీషదేవి ఎమ్మెల్యే అయ్యాక తొలిసారి మండలంలోని లబ్బర్తి అంగన్వాడీ కేంద్రానికి వెళ్లడంతో లాగరాయి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు, అధికారులు ఘన స్వాగతం పలికారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో దేవమణి, లాగరాయి సూపర్వైజర్ అమ్మాజీ ఉన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో శ్రీనివాసరావు

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 78 అర్జీలు

రంపచోడవరం, ఆగస్టు5: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సుమారు 78 అర్జీలు అందాయని ఐటడీఏ ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కల్వర్టులు నిర్మించాలని, గ్రామాల్లో సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, మంచినీటి ట్యాంకులు నిర్మించాలని, ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లకు వంతెనలు నిర్మించాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. డీడీ జాన్‌రాజ్, ఇనస్పెక్టరు ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, డీఈవో మల్లేశ్వరరావు, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌పీవో రాఘవన్ పాల్గొన్నారు.

గిరిజన యువతీ యువకులకు ప్రత్యేక శిక్షణ

చింతూరు, ఆగస్టు5: ఉపాధ్యాయ పోస్టుల పోటీ పరీక్షల్లో పాల్గొనదలిచే గిరిజన యువతీయువకులకు చింతూరు ఐటీడీఏ శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని ఐటీడీఏ పరిధిలోని గిరిజనయువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పీవో కోరారు. ఎటపాక యూత్ ట్రైనింగ్ సెంటరులో ఈ శిక్షణ ఆగస్టు మూడో వారం నుంచి 75 రోజులపాటు సాగనుందన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 6 నుంచి పదో తేదీ వరకు తమ దరఖాస్తులు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో సమర్పించుకోవాల్సి ఉందన్నారు. ఈనెల 14న ఐటీడీఏ నోటీసు బోర్డులో ఎంపికైన 50 అభ్యర్థులు పేర్లు ప్రకటించడం జరుగుతుందన్నారు. అనంతరం వారందరికీ ఉచిత భోజనం, వసతి కల్పించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లకు కమిటీ

చింతూరు, ఆగస్టు5: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకుందామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య పేర్కొన్నారు. సోమవారం ఐటీడీఏ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి గిరిజన సంఘాలు, వివిధ పార్టీలకు చెందిన గిరిజన నాయకులు, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. వేడుకల నిర్వహణపై ఒక ప్రణాళిక రచించేందుకు ఒక కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా పీవో కోరారు. ఆదివాసీ దినోత్సవం రోజున ఆదివాసీ పెద్దలను, వివిధ రంగాల్లో రాణించిన ఆదివాసీలను గౌరవించుకోవడం జరుగుతుందన్నారు. అంతకుముందు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించాల్సిందిగా ఉపాధ్యాయులకు పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఏపీవో కె సుజాత, ఏవో ఎస్ రాజకుమార్‌లు పాల్గొన్నారు.

డంప్‌లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ఎటపాక, ఆగస్టు 5: గుండాల జాతీయ రహదారి సమీపంలోని ఇసుక డంప్-1 లో దొంగతనంగా ఇసుక రవాణా పాల్పడుతున్న ఓ ట్రాక్టర్‌ను డీటీ, పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఇసుక డంపు వద్ద ఇసుకను దొంగతనంగా తరలిస్తున్నట్టు డీటీ పృథ్వీ, ఎస్ఐ పార్థసారిథికి సమాచారం అందింది. దాంతో వెంటనే గుండాల ఇసుక డంపు వద్దకురాగా, అప్పటికే ఇసుక డంపులో లోడ్ చేస్తున్న ట్రాక్టర్‌ను రెవెన్యూ, పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్ చోడవరం గ్రామానికి చెందినదిగా గుర్తించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారులు సమాచారాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేశారు.



విద్యా వలంటీర్లతో ఎంపీటీసీ వెంకటరమణ, ఎస్ఐ శివకుమార్, హెచ్ఎం

విద్యా వలంటీర్లకు సొంత ఖర్చుతో గౌరవ వేతనం

ఎంపీటీసీ వెంకటరమణ సేవలకు ప్రశంస

మోతుగూడెం, ఆగస్టు5: డొంకరాయిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో బోధనా సిబ్బంది లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. దీన్ని గుర్తించిన టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ చదువుకున్న యువతకు ఈ దుస్థితిని వివరించారు. ఆసక్తి కనబరిచిన ఐదుగురిని విద్యా వలంటీర్లుగా నియమించారు. ఎంపీపీ పాఠశాలకు ముగ్గురిని నియమించి ఒక్కొక్కరికి రూ.3 వేలు, జిల్లా పరిషత్ పాఠశాలకు ఇద్దరిని నియమించి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జీతం ఇస్తున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ శివకుమార్ ఈ సందర్భంగా రమణ సేవలను కొనియాడారు. ఆయా పాఠశాలల ఇన్‌చార్జి హెచ్‌ఎంలు ప్రవీణ్, కాత్యాయని మాట్లాడుతూ తాము గతంలో చాలా ప్రాంతాల్లో పనిచేశామని, ఇలా సొంత ఖర్చుతో విద్యా వలంటీర్లను ఎవరూ నియమించలేదన్నారు. పాఠశాలకు సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా రమణ పరిష్కరిస్తారని కొనియాడారు. వార్డు సభ్యుడు సీలావు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని పోరాట దినంగా నిర్వహించాలి

రంపచోడవరం, ఆగస్టు 5: ఆగస్టు 9న జరిపే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పోరాట దినంగా నిర్వహించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం నాయకులు బచ్చల బొజ్జిరెడ్డి, సాదల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడుకోవాలని, 2023 అటవీ నియమాల సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మా పేరు చెప్పి బెదిరిస్తే మాకు తెలియజేయండి : ఎమ్మెల్యే

రాజవొమ్మంగి, ఆగస్టు 5: గత ప్రభుత్వంలో అక్రమాలకు కొదవలేదని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. వైసీపీలో ఎమ్మెల్సీ అనంతబాబు అండదండలతో కొందరు ప్రజలను బెదిరించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిందని, తన పేరుతో ఎవరైనా ప్రజలను బెదిరిస్తే నేరుగా తమకు తెలియజేయాలని శిరీషదేవి అన్నారు. ఎమ్మెల్యే అండదండలతో కొందరు భూమిని ఆక్రమించిన వీడియోని కొందరు ప్రస్తుత రంపచోడవరం ఎమ్మెల్యే అని సోషల్ మీడియాలో ఇటీవల పెట్టారని, వాటిని చూసి ఆరా తీస్తే ఆ వీడియో గత ప్రభుత్వంలో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన సంఘటన అని తెలిసిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నందున ఇటువంటివి వైరల్ చేసి తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలెవరు నమ్మొద్దని ఆమె సూచించారు.



కంపోస్టు తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

కంపోస్టు తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషనర్

18వ సచివాలయం శానిటరీ సెక్రటరీకి షోకాజ్ నోటీసుకు ఆదేశం

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు5: ఎక్కువగా చెత్త వచ్చే అవకాశం ఉన్న అపార్టుమెంట్లు, హోటల్స్, ఇతర వినియోగదారులంతా వారి వద్ద ఉండే చెత్తను కంపోస్టు తయారు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. సోమవారం రాజమహేంద్రవరంలోని వెంకటేశ్వర నగర్‌లో అపార్టుమెంట్లు, షల్టాన్ హోటల్‌లో నిర్వహిస్తున్న కంపోస్టు తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అపార్టుమెంట్ల వారు ప్రతిరోజూ తమ వద్ద ఉన్న చెత్తను కంపోస్టుగా తయారుచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటరీ సెక్రటరీలు తమ పరిధిలోని పెద్ద మొత్తంలో చెత్త ఉత్పత్తి చేసే వారినందరినీ కలిసి వారంతట వారే కంపోస్టు తయారు చేసుకునేలా తగిన సూచనలు, శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శానిటరీ సెక్రటరీలు ప్రతిరోజు ఫీల్డ్ విజిట్ నిర్వహించాలన్నారు. విధినిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన 18వ సచివాలయం శానిటరీ సెక్రటరీకి షోకాజు నోటీసు జారీచేయాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్నను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్‌హెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికే ఫుడ్ ప్లాజా షాపులు మూసివేయాలి

అర్బన్ ఫుడ్ ప్లాజా వద్ద గల షాపులను ప్రభుత్వ నిర్దేశం ప్రకారం ప్రతిరోజు రాత్రి 11 గంటలకే మూసివేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గత రాత్రి ఈట్ స్ట్రీట్ షాపులను సందర్శించానని ఆయన తెలిపారు. రాత్రి 11 గంట తర్వాత షాపులు తెరచివుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, నిర్ణీత సమయంలోగా షాపులు మూసివేసేలా చూడాలని నగర పాలక సంస్థ సెక్యూరిటీ గార్డులను ఆయన ఆదేశించారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

మహిళల రక్షణ మా బాధ్యత: ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: శాంతిభద్రతలు, మహిళల రక్షణ కూటమి ప్రభుత్వ బాధ్యత అని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 2వ డివిజన్ వాంబేకాలనీలో సోమవారం రాత్రి జరిగిన మీ భద్రత - మా బాధ్యత సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో బ్లేడు బ్యాచ్‌లు, గంజాయి బ్యాచ్‌లను లేకుండా చేస్తామన్నారు. పోలీస్, ఇతర శాఖల సమన్వయంతో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తుందన్నారు. మహిళలకు రక్షణపరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అధికారులు, పోలీసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భరత్‌రామ్ నోరు అదుపులో పెట్టుకో : టీడీపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్‌రామ్ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటావని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి హెచ్చరించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్ 72 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన నాటి నుంచి భరత్‌రామ్‌కు మతి భ్రమించిందన్నారు. అందుకే ఆదిరెడ్డి కుటుంబాన్ని చిట్‌ఫండ్ వ్యాపారం పేరుతోను, ఇతర సంబంధంలేని వాటితో కలిపి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్యాపురం బ్యాంక్‌కు గత ఐదేళ్లుగా ఎన్నికలు లేకుండా చేసి అందులో భరత్‌రామ్ కనుసన్నల్లో చేసిన అవినీతిని బయటకు తీస్తున్నారని అన్నారు. కోటి 70 లక్షల వరకు అక్రమాలు బ్యాంక్‌లో జరిగాయని, వాటి లెక్కలు తేల్చుతామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, బేసరి చిన్ని, మళ్ళ వెంకట్రాజు, కరగాని వేణు, బంగారు నాగేశ్వరావు, బషీర్, సలీమ్ పాల్గొన్నారు.

నగరంలో మౌలిక సదుపాయాల కోసం 27 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగరంలో మౌలిక సదుపాయాలకోసం 27 అర్జీలు వచ్చాయి. ఉదయం పది గంటల నుంచి అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగరంలో ఇందిరానగర్‌కు చెందిన జి.భాగ్యం అనే మహిళ తమ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, డి.రత్నవేణి అనే మహిళ 2017 నుంచి 2019 వరకు ఇంటి పన్ను డిమాండ్ ఎంట్రీస్ ఇప్పించాలని, కృష్ణవేణి అనే మహిళ తన స్థలంలో కార్పొరేషన్ వారు రోడ్డు వేస్తున్నారని.. ఈ రహదారి నిర్మాణం ఆపాలని, గానుక వీధిలో తనకు షాపు నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని, కోటిలింగాలపేటకు చెందిన రాజా వెంకట కృష్ణ మోహన్ అనే వ్యక్తి తమ కాలనీలో చెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని, వాటిని కొట్టించాలని, మరికొంతమంది పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్ల సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండు రంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 16 నుంచి రెండు నెలలు కృతజ్ఞత యాత్ర

ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: ఈనెల 16వ తేదీ నుంచి హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు రెండునెలలపాటు కృతజ్ఞతా యాత్రను చేస్తున్నామని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరావు తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన, దళిత వర్గాల ఫెడరేషన్ అధ్యక్షుడు చెట్టే రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు కట్టుబడి రాష్ట్రం అసెంబ్లీలో చంద్రబాబు తీర్మానం చేస్తారని చెప్పారు. అందుకు కృతజ్ఞతగా ఈనెల 16న హిందుపురం నుంచి కారు యాత్ర చేపట్టి ఇచ్ఛాపురం వరకు నిర్వహిస్తామని చెప్పారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాలలను రెచ్చగొట్టడం మానుకోవాలన్నారు.



కొండగుంటూరులో సంబరాలు చేసుకుంటున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

కొండగుంటూరులో ఎంఆర్‌పీఎస్ సంబరాలు

దివాన్‌చెరువు, ఆగస్టు 5: ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమాల్లో రాష్ట్రంలోనే తూర్పుగోదావరి జిల్లా మొదటి స్థానంలో ఉంటే, జిల్లాలో కొండగుంటూరు ప్రథమస్థానంలో నిలిచిందని ఎంఆర్‌పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల హర్షంవ్యక్తం చేస్తూ రాజానగరం మండలం కొండగుంటూరులో డప్పువాయిద్యాలతో కృష్ణమాదిగ ఫ్లెక్సీతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.



రంగంపేటలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

విద్యకు ప్రాధాన్యం ఇచ్చింది టీడీపీ ప్రభుత్వమే : ఎమ్మెల్యే

రంగంపేట, ఆగస్టు 5: విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది తెలుగుదేశం ప్రభుత్వమేనని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.హేమ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఎమ్మెల్యే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట చుట్టూ ఉన్న గ్రామాల విద్యార్థులకు ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంతో ఉపయోగపడుతోందని, త్వరలో రంగంపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు తన వంతుకృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలపాల త్రిమూర్తులు, మండల అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, మండల బీజేపీ అధ్యక్షుడు మైలవరపు సాయిరాం, గ్రామ ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, నాయకులు ఉండవిల్లి గిరిబాబు, గారపాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, గుండుపల్లి ప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం వి.పార్థసారధి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

వ్యవసాయ కళాశాలను పరిశీలించిన గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్ , ఆగస్టు5: రూరల్ మండలం కాతేరులోని శ్రీఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలోగల వ్యవసాయ కళాశాలను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సందర్శించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కాలేజీ అభివృద్ధి చెందలేదని, ఇంకా 50 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తాను కళాశాలకు 23 ఎకరాలు మంజూరు చేయించానన్నారు. హాస్టలు వసతి లేక ఇతర జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాబార్డు నుంచి నిధులు మంజూరు చేయించి, కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా గోరంట్ల విద్యార్థులతో మాట్లాడి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బ్రోచర్‌ని విడుదల చేస్తున్న క్రెడాయ్ గౌరవ చైర్మన్ శ్రీనివాస్, ఇతరులు

సెప్టెంబరు 13,14,15 తేదీల్లో క్రెడాయ్ హోమ్‌ఎక్స్‌పో

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు5: క్రెడాయ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 13, 14,15 తేదీల్లో రాజమహేంద్రవరం చెరుకూరి కన్వెన్షన్ సెంటర్‌లో హోమ్ ఎక్స్‌పో-2024ను నిర్వహిస్తున్నామని క్రెడాయ్ గౌరవ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాస్ తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల జరిగే 5వ హోమ్‌ఎక్స్‌పోలో అపార్టుమెంట్ ప్రోపర్టీస్, రెసిడెంటల్ ప్రోపర్టీస్, ప్రోపర్టీస్ ఇన్సూరెన్స్, హార్డ్‌వేర్ టూల్స్, ఎయిర్ కండీషన్, రిఫ్రిజిరేషన్స్, ల్యాండ్ స్కేపింగ్ పరికరాలు, ఫైర్ సేఫ్టీ సిస్టమ్స్, శానిటరీ వేర్, రూఫింగ్ సిస్టమ్ తదితర మెటీరియల్ స్టాల్స్ ఉంటాయని చెప్పారు. సెప్టెంబరు 15న రాత్రి 8 గంటలకు బంపర్ డ్రా తీస్తామన్నారు. చైర్మన్ సూరవరపు శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షుడు మన్యం ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి చల్లా మురళీ, జాయింట్ సెక్రటరీ వెలుమూరి భీమశంకరరావు, కోశాధికారి టీవీఎల్ నరసింహరావు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ఒలింపిక్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ధవళేశ్వరంలో విద్యార్థినుల ఒలింపిక్ ర్యాలీ

ధవళేశ్వరం, ఆగస్టు5: పిల్లల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచడానికి కృషి చేస్తున్నట్టు జిల్లా క్రీడాసాధికార అధికారి డీఎంఎం శేషగిరి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి ఒలింపిక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బాస్కెట్‌బాల్ కోచ్ ఎం.మోహన్‌దాస్, యోగా కోచ్ బీవీజీ నాగేంద్ర, స్కూల్ హెచ్ఎం ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఇగ్నోలో భగవద్గీతలో పీజీ కోర్సు

రాజమహేంద్రవరంఅర్బన్, ఆగస్టు5: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ద్వారా ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి భగవద్గీతలో పీజీ కోర్సు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఇగ్నోలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల గడువును ఆగస్టు 14వ తేదీ వరకూ పొడిగించినట్టు తెలిపారు. వైద్య విద్యార్థులకు హెల్త్ అండ్ న్యూట్రీషన్ కోర్సు, లీగల్ ప్రాక్టీస్‌లో ఉన్నవారికి వివిధ చట్టాలకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు, ఉపాధ్యాయులకు అనువైన కోర్సులను ఇగ్నో అందిస్తోందని తెలిపారు. వీటితోపాటు ఎంబీఏలో రెండు వినూత్నమైన కోర్సులు ప్రారంభించడం జరిగిందని, ఇంజనీరింగ్ చేసిన వారికి ఉపాధి కల్పించేవిధంగా ఈ కోర్సులు ఉంటాయని తెలిపారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలు చేయవచ్చని, ఒకటి రెగ్యులర్ మోడ్‌లోను, మరొకటి డిస్టెన్స్ లెర్నింగ్ లేదా ఆన్‌లైన్‌లోనూ చేయవచ్చని, పలు కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ ఉంటుందని తెలిపారు.

'సీపీఎస్, జీవో 117ల రద్దు కోసం అవిశ్రాంత పోరాటం'

బిక్కవోలు, ఆగస్టు 5: సీపీఎస్, జీవో 117 రద్దు, అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్ పదోన్నతులపై అవిశ్రాంత పోరాటం చేస్తున్నామని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు వి.భామిరెడ్డి తెలిపారు. మండలంలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కొంకుదురు, ఇళ్లపల్లి ఉన్నత పాఠశాలల్లో పలువురు ఉపాధ్యాయులను ఎస్టీయూలో చేర్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికకమిటీ సభ్యుడు టి.ఈశ్వరరెడ్డి, ఎస్టీయూ నేతలు లక్ష్మీనారాయణ, సురేంద్రకుమార్‌రెడ్డి, పోలి రామారెడ్డి, జ్యోతి, జేఎస్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సోమేశ్వరశర్మ పాల్గొన్నారు.



'ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించండి'

గోకవరం, ఆగస్టు 5: షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులననుసరించి అధిక దిగుబడులను సాధించాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (ఏపీసీఎన్ఎఫ్) నిర్వాహకుడు డాక్టర్ వీఎస్ఆర్ నాయుడు రైతులకు సూచించారు. గోకవరం మండలంలోని వీరలింకపల్లి గ్రామ శివారున ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రసాయన పురుగుమందుల అవశేషాలు లేని పంటల సాగును ప్రోత్సహించే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతీ రైతు పాటించాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ విత్తనం నుంచి విత్తనం వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తే ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చన్నారు. బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, దశపత్ర కషాయం, నీమాస్త్రం, తదితర కషాయాల తయారీ పద్ధతులను రైతులకు వివరించారు.



మునగాలలో ముంపులో కుళ్లిన వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ముంపు పంటలను పరిశీలించిన ఏరువాక శాస్త్రవేత్తలు

కోరుకొండ, ఆగస్టు5: మునగాల, శ్రీరంగపట్నంలలో వరద ముంపునకు గురైన వరి పైరును సోమవారం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలించినట్టు తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు తెలిపారు. అధిక వర్షాలకు పంట నీట మునిగి పాడైపోయిన వరి పొలాల వద్దకు వెళ్లి నీటిలో కుళ్లిపోయిన వరి దుబ్బులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వరదనీరు తీసిన తర్వాత స్వల్పకాలిక రకాలైన ఎఫ్‌టీయూ 1153, ఎఫ్‌టీయూ 1156 వరి వంగడాలను నేరుగా చల్లడంకానీ, నారుపెట్టి ఉంచుకోవడంకానీ చేయాలన్నారు. దీని ద్వారా సీజన్ నష్టపోకుండా చేసుకోవచ్చన్నారు. అలాగే పాక్షికంగా పంట నష్టపోయిన రైతులు వరద నీరు పూర్తిగా బయటకుపోయిన పక్షంలో ఎకరా వరి పొలంలో 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేసుకుంటే పంట త్వరగా కోలుకుంటుందన్నారు. ఈ క్షేత్ర పర్యటనలో ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి గౌరీదేవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

సచివాలయంలో నాయకుల చిత్రపటాల ఏర్పాటు

కోరుకొండ, ఆగస్టు5: కోరుకొండ సచివాలయం వద్ద సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ చిత్రపటాలతోపాటు రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి ఫొటోను కూడా బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సెక్రటరీ బత్తిన వీరాంజనేయులు, జిల్లా మహిళామోర్చ అధ్యక్షురాలు మద్దిపాటి రజని, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పచ్చారి నరసింహమూర్తి, చింతల కన్నారావు, పంచాయతీ ఈవో రమేష్‌బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నర్సాపురంలో మర్ల సీతారామశాస్త్రిని సత్కరిస్తున్న దృశ్యం

పురోహిత బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడికి సత్కారం

కోరుకొండ, ఆగస్టు5: ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మర్ల సీతారామశాస్త్రిని సోమవారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కోరుకొండ మండలం నర్సాపురం గ్రామానికి చెందిన సీతారామశాస్త్రి సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికకావడం తమ గ్రామానికి ఎంతో గౌరవం తెచ్చిపెట్టిందని గ్రామస్తులు పెదపాటి భీమరాజు, రాయపాటి సత్తిబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీతారామశాస్త్రికి, అయన తండ్రి ప్రభాకరశాస్త్రికి పాద పూజలు చేశారు. పూలమాలలువేసి శాలువాలతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఇదే కుటుంబానికి చెందిన కలవచర్ల గ్రామం నివాసి మర్ల సుబ్రహ్మణ్య కౌడిన్య పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కార్యనిర్వహణాధికారిగా ఎంపికకావడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పీతా శ్రీను, అంచూరి వెంకటరమణ, బొల్లంపల్లి నాగేశ్వరరావు, పద్మనాభుని ప్రసాదు, మారిశెట్టి దుర్గారావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

రంగంపేట, ఆగస్టు 5: రంగంపేట మండలంలో ఉపాధి హామీ పథకం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై ఈనెల 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీలు, 17న మండల ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో పి.వెంకటరత్నం అన్నారు. సోమవారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పీఆర్ ఇంజనీరింగ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ, ఉపాధి ఏపీవో జి.వెంకటేశ్వర్లు, ఎస్ఆర్‌పీ వి.తులసీనాయక్ పాల్గొన్నారు.



స్వల్పంగా పెరుగుతున్న గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 5 : ఎగువ నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 8.30 అడుగల నుంచి 9 అడుగులకు పెరిగింది. ఆదివారం రాత్రి 9 గంటలకు 8.30 అడుగులుగా నమోదైన నీటిమట్టం 6 గంటల పాటు నిలకడగా కొనసాగి సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పెరిగింది. కాటన్ బ్యారేజ్ నుంచి 6,33,226 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ఎగువున భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 8 గంటలకు 35.60 అడుగులుగా నమోదైంది.



కలెక్టరేట్ ముట్టడి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 5 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుం చి స్కీం వర్కర్లు, చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని వాటిని నిలుపుదల చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ,జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారన్నారు.అరకొర వేతనాలతో ప్రభుత్వ శాఖల్లో అనేక ఏళ్ళుగా పనిచేస్తున్న వారిని వేధింపులకు గురిచేయడం..బలవంతంగా తొలగించడాన్ని ఖండించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్‌మూర్తి, సహాయ కార్యదర్శి పూర్తిమారాజు, జిల్లా కమిటీ నాయకులు బి.పవన్, పి.తులసి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఏపీ అంగన్‌వాడీ అధ్యక్షురాలు సిహెచ్ మాణిక్యాంబ, వై.బేబిరాణి, ఎం.వెంకటలక్ష్మి, మధ్యాహ్నభోజన పథకం కార్మికులు చిట్లా బేబి,వెలుగు యానిమేటర్స్ ప్రమీళ, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లతో సీఎం సమీక్ష



రాజధాని వెలగపూడిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా స్వామ్యంలో తప్పుచేయాలంటే భయపడేలా మన పాలన ఉండాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజధాని వెలగపూడిలో సోమవారం జరిగిన జిల్లా కలెక్టర్లు,ఎస్పీల తొలి సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా అధికార యంత్రాంగానికి విజన్ 2047పై చంద్రబాబునాయుడు దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు మంచి పాలన అందించాలన్నారు. తమ ప్రభుత్వం రాజకీయంగా అధి కారులను బలి చేయదన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని, వారి అవసరాలు, సమస్యలు ఏంటో తెలుసుకోవాలని,అ న్నివర్గాల ప్రజల సంక్షేమ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయా లన్నారు. ప్రభుత్వం మీద ఎవరైనా ఫేక్ ప్రచారం చేస్తే అధికారులు ఖండించాలన్నారు. ఎక్కడైనా చెడు జరిగినట్టు తెలిస్తే ఆధారాలతో వివరించాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిశోర్ పాల్గొన్నారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు,మునిసిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ వర్చువల్ విధానం లో సదస్సులో పాల్గొన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ ఒక నివేదిక తీసుకుని వెళ్లారు. కానీ అక్కడ రాష్ట్ర స్థాయి అధికారులు ఆయా శాఖల మీద సమీక్ష చేశారు. మంగళవారం అంటే నేడు జిల్లాల వారీగా సమీక్షించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అన్ని శాఖల మంత్రులు పాల్గొన్నారు.

పోలీస్..బది లీలలు!

- ఉత్తర్వుల్లేవ్.. నోటిమాటతో పోస్టింగ్‌లు
- జిల్లాలో డీఎస్పీ, సీఐల బదిలీల్లో విచిత్రం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో డీఎస్పీలు,సీఐల బదిలీల్లో విచిత్ర పరిస్థితి కానవస్తోంది. ఖాళీ అయిన సీటులో ఎవరు వచ్చి కూర్చుంటారో అనే ఆందోళనతో మౌఖిక ఆదేశాలతో కూడా హుటాహుటిన బాధ్యతలు స్వీకరించేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఐదుగురు సీఐలను బదిలీ చేసిన విషయం తెలిసిందే. కొవ్వూరు టౌన్, రూరల్, రాజమహేంద్రవరం త్రీటౌన్, సీసీఎస్-1, 2 సీఐలను బదిలీ చేస్తూ ఈ నెల 2న ఉత్తర్వులు వెలువడ్డాయి. త్రీటౌన్ సీఐగా జి.మధుబాబును నియమించారు.కానీ అయన పోస్టింగ్‌ని హోల్డ్‌లో పెట్టారు. ఇంతలో త్రీటౌన్ సీఐగా అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. అప్పారావు ఎస్పీ మౌఖిక ఆదేశాలతో జాయిన్ అయ్యారని.. రాతపూర్వక ఆదేశాలు ఇంకా ఇవ్వలేదని తెలుస్తోంది. త్రీటౌన్ నుంచి వీఆర్‌కి వెళ్లిన ఎస్.వసన్న వీరయ్య గౌడ్ రాజానగరం, అక్కడి సీఐ కాశీవిశ్వనాథ్ గోకవరం,త్రీటౌన్ ఇచ్చినట్టే ఇచ్చి పక్కన పెట్టిన మధుబాబుకు ప్రకాశ్ నగర్, వన్‌టౌన్ బాజీలాల్‌కి డీవోలు అయ్యాయని అంటున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎవరికీ లిఖిత ఆదేశాలు లేవు. ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేశారు. వీఆర్‌కి పంపిన వాళ్లు సీటు సంపాదించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఎవరు ఏ స్టేషన్‌లో కుదుట పడతారో తెలియని అయోమయం నెలకొంది. రెండు మూడు రోజుల్లో సీఐల బదిలీలపై అధికారిక ఉత్తర్వులు వెలువడతాయని చెబుతున్నారు.జిల్లా నుంచి ఐదుగురు డీఎస్పీలకు ఇటీవల స్థాన చలనం కల్పించారు.సౌత్ జోన్ అంబికా ప్రసాద్, సెంట్రల్ జోన్ విజయపాల్, క్రైమ్స్ శ్రీనివాసమూర్తి, దిశ ఆదినారాయణలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈస్ట్‌జోన్ కిషోర్ బాబును ఏసీబీకి పంపించారు.ఈ నేపథ్యంలో ఆయా జోన్లకు డీఎస్పీలను కేటాయిస్తూ త్వరలో ఆదేశాలు వస్తాయని చెబుతున్నారు.ఈ లోపుగా ఎవరి 'దారి'లో వారు వెళుతున్నారు. సీఐల బదిలీల క్రతువు ముగిసిన తర్వాత ఎస్ఐల వంతు వచ్చే అవకాశం ఉంది.ఏదేమైనా ఈ నెలఖరు నాటికి ఆయా స్టేషన్లలో నాలుగో సింహాలు ఎవరనే విషయంపై స్పష్టత రానుంది.

త్రీటౌన్ సీఐగా అప్పారావు



రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ సీఐగా వి.అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన ఇక్కడ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఎస్ఈ బీకి వెళ్లారు. ప్రస్తుతం ఏలూరు ఏంజ్ వీఆర్‌లో ఉన్న ఆయనను జిల్లా వీఆర్‌కి కేటాయించారు.

అన్న క్యాంటీన్లు విడుదల



ఐదేళ్లుగా వైసీపీ తాళాలు

- 2014లో పథకం ఆరంభం
- 2019 వరకూ ఆకలి తీర్చాయి
- ప్రభుత్వం మారడంతో తాళాలు
- పేదల కడుపుపై కొట్టిన జగన్
- భవనాలు ఐదేళ్లు మూతే
- కూటమి రాకతో పునఃప్రారంభం
- ఆగస్టు 15 నుంచి ఆరంభం
- జిల్లాలో ఐదు ఏర్పాటు
- రాజమహేంద్రిలో మూడు
- కొవ్వూరు, నిడదవోలులో ఒక్కొక్కటి
- శరవేగంగా సాగుతున్న పనులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం సిటీ

అన్న క్యాంటీన్లకు స్వాతంత్ర్యం వచ్చేసింది..ఐదేళ్ల తరువాత విడుదలయ్యాయి.. గత టీడీపీ ప్రభుత్వంలో పేదల కడుపునింపిన అన్న క్యాంటీన్లకు వైసీపీ ప్రభుత్వంలో తాళాలు పడ్డాయి..ఐదేళ్లు ఒక్క అన్న క్యాంటీన్ తెరవ లేదు. కక్ష సాధింపు దోరణితో మూసివేశారు. టీడీపీ నాయకులు అక్కడక్కడా అన్న క్యాంటీన్ల అంటూ బయటకొచ్చినా కేసులు పెట్టి వేధించారు. ప్రభుత్వం మారడంతో అన్న క్యాంటీన్లు విడుదలయ్యాయి.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజునే మళ్లీ తెరుచుకోనున్నాయి.

2014లో అన్న క్యాంటీన్లు ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు రూ.5లకే పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు కూటమి ప్రభుత్వం సిద్ధం చేసింది. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక నిరుపేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు చాలా ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. అప్పట్లో వీటి నిర్మాణానికి ఒక్కొక్క దానికి సుమారు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చుచేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 వరకు పని చేశాయి. లక్షలాది మంది ఆకలి బాధలు తీర్చాయి. అయితే ఆ తరువాత జగన్ ప్రభుత్వం అధికారం చేపట్టడంతో మూతపడ్డాయి. ఐదేళ్లు పాటు అన్న క్యాంటీన్లకు తాళాలు వేసే ఉంచారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ తాళాలు తెరుచుకున్నాయి. ఈనెల 15వతేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వీటిని ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం క్యాంటీన్లు సిద్ధం అవుతున్నాయి.

వైసీపీ పాలనలో మూత

రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదల కోసం ఈ క్యాంటీన్లను ప్రారంభించిన సంగతి తెలిసిందే. మార్కెట్‌లో కనీసం రోడ్డు పక్క దుకాణంలో ఇడ్లీ తినాలంటే కనీసం రూ.20 ఉండ వలసిందే. ఇదే ఓ మోస్తరు హోటల్‌లో రూ.35కు పైనే. నిత్యావసరాల ధరలు పెరగడంతో ఇష్టానుసారం ధరలు పెంచేసిన సంగతి తెలిసిందే.పట్టెడన్నం తినాలంటే కనీసం రూ.100 ఉండాలి.ఇ టువంటి పరిస్థితులను గమనించిన టీడీపీ అధినేత 2019 వరకూ రాష్ట్రంలో పేదల కోసం అన్నక్యాంటీన్లు నిర్వహించారు. కేవలం రూ.5కే టిఫిన్, లంచ్, డిన్నర్ కూడా కేవలం రూ.10లకే అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద, పేదలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, సాధారణ ప్రజల కు అందుబాటులో ఉండేవిధంగా అన్న క్యాంటీన్లు ఏర్పా టు చేసిన సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం అధికా రంలోకి రాగానే అన్న క్యాంటీన్లను మూసేశారు. భవనా లు కూలగొట్టాలని ప్రయత్నించారు. కానీ టీడీపీ పోరాడి నిలబెట్టింది. కూటమి అధికారంలోకి రావడంతో పేదలకు రూ.5లకే మళ్లీ కడుపు నింపనుంది. ఎన్నికలకు ముందే చంద్ర బాబు అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.దీనిలో భాగంగా ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించడానికి నిర్ణయం తీసుకున్నా రు.గత వైసీపీ హయాంలో పాడైన అన్నక్యాంటీన్లకు మళ్లీ మరమ్మతులు చేసి ముస్తాబు చేస్తున్నారు.ఈ నెల 10వ తేదీకి సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో ఐదు క్యాంటీన్లు

మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీల ఆధ్వర్యంలో ఇవి సిద్ధమవుతున్నాయి.రాజమహేంద్రవరంలో ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి వద్ద రూ.5.1 లక్షలతో మరమ్మతులు చేసి ముస్తాబు చేశారు.క్వారీ మా ర్కెట్‌లో రూ.7.9 లక్షలతో ముస్తాబు చేశా రు. ఆనం కళాకేంద్రం సమీపంలోని సుబ్రహ్మణ్య మైదానంలో రూ. 4.5 లక్షలతో ఖర్చుతో సిద్ధం చేశారు.కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రూ.2.8 లక్షలతో సిద్ధం చేస్తున్నారు. ఇది ఇంకా పూర్తి కాలేదు.నిడదవోలు ఐదో వార్డులోని పంగిడిరోడ్డులో రూ.6.25 లక్షలతో సిద్ధం చేస్తున్నారు.ఇది ఇంకా పూర్తి కాలేదు. కానీ 10వ తేదీకి అన్ని సిద్ధంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశా లు జారీ చేసింది. పనులు చురుగ్గా సాగుతున్నాయి.





డీజీపీని కలిసిన ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): డీజీపీ ద్వారకాతిరుమలరావును తూర్పుగోదావరి ఎస్పీ నరసింహ కిశోర్ విజయవాడలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఎం చంద్రబాబు సమావేశానికి హాజరయ్యారు.

విలీన గ్రామాలకు ప్రత్యేకాధికారులు మార్పు

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 5 : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదిత గ్రామాల ప్రత్యేకాధికారులను మార్పు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి డి రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ మండలం పరిధిలో గల తొర్రేడు,వెంకటనగరం, కాతేరు, కోలమూరు, హుకుంపేట, పిడింగొయ్యి, రాజవోలు, బొమ్మూరు, శాటిలైట్ సిటీతో పాటు కడియం మండలం పరిధి వేమగిరి గ్రామాలకు ప్రత్యేకాధికారిగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌ను నియమించారు. ఇక రాజానగరం మండల పరిధిలో గల చక్రద్వారబంధం, నామవరం గ్రామాలకు రాజమహేంద్రవరం ఆర్డీవో, పాలచర్ల, వెలుగుబంద గ్రామాలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఆర్‌సీసీ నియమించారు. కోరుకొండ మండల పరిధిలో గల గాడాల, నిడిగట్ల గ్రామాలకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఓఎస్‌జీసీ, బూరుగుపూడి, మధురపూడి గ్రామాలకు డివిజనల్ పంచాయతీ అధికారి,ని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయా గ్రామాలన్నీ విలీన ప్రతిపాదనతో సుమారు 15 ఏళ్లుగా ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. 2016-17 తెలుగదేశం ప్రభుత్వం హయాంలో ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో భారీమొత్తంలో అవకతవకలు జరిగిందనే ఆరోపణలు రావడంతో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అప్పటి కమిషనర్ విజయరామరాజును విలీన గ్రామాల ప్రత్యేకాధికారిగా నియమించారు. సుమారు 4 నెలల పాటు ప్రత్యేకాధికారిగా ఉన్నారు. నగరపాలక సంస్థ అధికారులకు పంచాయతీలపై అజమాయిషీ చేసే అధికారం లేదంటూ కొంతమంది కోర్టును ఆశ్రయించగా కమిషనర్‌ను తొలగించి.. ప్రత్యేకాధికారులను నియమించారు.

సోలార్.. బోరు..బోరు!



టీడీపీ సోలార్ పథకానికి వైసీపీ రివర్స్ గేర్

- విద్యుత్ ఆదాకు సోలార్ మోటార్లు
- గత టీడీపీ హయాంలో రైతు పథకం
- జిల్లాలో 3 వేల వరకూ ఏర్పాటు
- మరమ్మతులకు గురై మూలకు
- ఆ పథకాన్ని గాలికొదిలేసిన వైసీపీ
- కూటమి దృష్టి పెట్టాలంటున్న రైతన్న

పెరవలి, ఆగస్టు 5 : జగన్ ప్రభుత్వం సంక్షేమం ముసుగులో జనాన్ని మభ్యపెట్టింది.. గత ప్రభుత్వంలో దీర్ఘకాలికంగా ఆలోచించి రూపొందించిన పథకాలను అటకెక్కించింది.. అంతా తానే చేశారు.. చేస్తున్నానని చెప్పుకుంటూ వచ్చారు. ఎందుకంటే ఏ పథకం చూసినా జగన్ పేరే.. గత టీడీపీ ప్రభుత్వంలో సోలార్ మోటార్లు ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారం చేట్టిందో లేదో సోలార్ పథకానికి చెదలు పట్టింది.. వైఎస్సార్ జలసిరి పేరుతో కొత్త పథకం అమల్లోకి తెచ్చినా అది అంతంతమాత్రంగానే సాగింది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సంక్షేమ తెరతొలగింది. అసలు విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.


బోరుమన్న పథకం..

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతులకు సోలార్ మోటార్లు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలోనే 3 వేల మోటార్ల వరకూ ఉన్నట్టు సమాచారం. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిపై శ్రద్ధ చూపకపోవడంతో చాలా వరకు మూలకుచేరాయి.విద్యుత్ పొదుపు చేయాలనే ఉద్దేశంతో రైతులకు విరివిగా సోలార్ మోటార్లు ఏర్పాటు చేశారు. పథకం ఆరంభించిన మొదట్లో రైతులు వద్ద రూ. 55 వేలు కట్టించుకుని సోలార్ ప్లేట్లతో పాటు మోటార్‌ను అందజేశారు. బోరు మాత్రం మాత్రం రైతు వేయించుకునేవారు. పథకంలో భాగంగా కొంత మంది రైతులు ఈ మోటార్లు వేయించుకున్నారు. చాలా మం ది రైతులకు రూ.55 వేలు కట్టడం భారంగా మారడంతో ఆ పథకంలో మార్పులు చేశారు. రూ.25 వేలు చెల్లిస్తే రైతులు పొలంలో సోలార్ ప్లేట్‌లు బిగించడంతో పాటు ఉచితంగా బోరు కూడా వేసి మోటారు కూడా ఏర్పాటు చేసేలా పథకంలో మార్పులు చేశారు. దీంతో ఎక్కువ మంది రైతులు ఈ పథకంలో సోలార్ మోటార్లు వేయించుకున్నారు. ఈ మోటార్లు వేయడానికి కొన్ని సోలార్ కంపెనీలకు కాంట్రాక్ట్ ఇచ్చి ఐదేళ్ల పాటు వాటి నిర్వహణ బాధ్యతను అప్పగించారు.అప్పట్లో ఏర్పాటు చేసిన మోటార్లు కేవలం రెండు అంగులాలు మాత్రమే నీరు ఇస్తుండడంతో రైతులకు ఏ మాత్రం సరిపోయేది కాదు.విద్యుత్‌పై ఆధారపడిన మోటార్లు మూడు అంగులాలు, నాలుగు అంగులాలు నీరందిస్తూ ఉంటాయి. కేవలం డ్రిప్‌పై వ్యవసాయం చేసే వారికి మాత్రమే రెండు అంగులాలు మోటార్లు పనిచేస్తాయని చెబుతున్నారు.దీంతో రైతులు ఈ మోటార్లు వాడకం మానేసి విద్యుత్ మోటార్లు వైపు మొగ్గు చూపారు.

మూలకు చేరిన సోలార్ ప్లేట్లు..

చిన్న రైతులు మాత్రం ఈ మోటార్లపైనే ఆధారపడి వ్యవసాయం చేసేవారు.అయితే కాలక్రమంలో ఈ మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని బాగు చేయించాలంటే మళ్లీ వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి రావడంతో రైతులు వాటిని నిర్లక్ష్యంగా వదిలి వేశారు. తమ భూములకు నీరు కావాల్సి వస్తే పక్క రైతులపై ఆధారపడుతున్నారు. చాలా మంది రైతులు ఈ సోలార్ ప్లేట్లను అతి తక్కువ రేట్లకు విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం వాటిని తక్కువ రేటుకు ఇవ్వడం ఇష్టం లేక తమ పొలాల్లో అలాగే ఉంచారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు మళ్లీ సోలార్ విద్యుత్‌పై దృష్టి కేంద్రీకరించడంతో రైతులు ఆశలు చిగురిస్తున్నాయి. తమ మోటార్లను ప్రభుత్వమే బాగు చేయించి తమకు నీరు వచ్చేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ సోలార్‌విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి రైతులకు ప్రభుత్వమే సొమ్ములు ఇచ్చేలా గతంలో చంద్రబాబు ఆలోచన చేశారు. ప్రస్తుతం అదే ఆచరణలోపెట్టి యూనిట్‌కు ఇంత రేటు చొప్పున తమకు చెల్లిస్తే ఎంతో కొంత ఆదాయం వస్తుందని రైతులు అంటు న్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రైతుల పొలాల్లో వృధాగా ఉన్న ఈ సోలార్ ప్లేట్లు ఉపయోగపడే విధంగా చేయాలని పలువురు కోరుతున్నారు.

సోలార్ మోటారు పని చేయడం లేదు..



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నా పొలంలో సోలార్ మోటారు ఏర్పాటు చేయించా. రూ.25 వేలు ప్రభుత్వానికి చెల్లించడంతో ప్లేట్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా బోరు వేసి మోటారు ఏర్పాటు చేశారు. కొంత కాలం మోటారు బాగానే పని చేసింది. అనంతరం మోటారు స్టార్టర్ పనిచేయలేదు. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ప్రస్తుతం అది నిరూపయోగంగా ఉంది. ప్రభుత్వమే పరిష్కారం చూపాలి.- **నందమూరి రామారావు, రైతు, తీపర్రు**



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా అధికారులు


పీజీఆర్ఎస్‌లో 150 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 5 : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 150 అర్జీలను అందించారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా అధికారు లంతా అందుబాటులో ఉన్నారు.ధవళేశ్వరానికి చెందిన పల్నాటి పార్వతి దేవి దివ్యాంగురాలు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ ప్రత్యేక వైద్య అవసరాల దృష్ట్యా రూ.15 వేలకు పెంచాలని అర్జీపెట్టుకుంది. జిల్లాలో పలు మండలాలకు చెందిన ప్రజలు పించన్లు, ఇళ్ల స్థలాలు, రహదారులు, డ్రైనేజీ సమస్యలతో కూడిన అర్జీలు అందించారు.రెవెన్యూ విభాగానికి 42, పీఆర్‌కు 26,హోం శాఖకు 25, వైద్య ఆరోగ్యశాఖకు 16, మునిసిపాలిటీకి 10, ఇతర శాఖలకు 41 అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జి జేసీ నరింహులు తెలిపారు. మొత్తం 139 ఆన్‌లైన్‌లో, 11 అర్జీలు ఆఫ్‌లైన్‌లో నమోదు చేశామన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసల్ సిస్టం(మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు స్వయంగా మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మొత్తం 27 అర్జీలను స్వీకరించారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి తగు సూచనలిచ్చారు. ఫిర్యాదును ఏ అధికారికి అయితే కేటాయించారో వారే సీఐ, ఎస్ఐ సమక్షంలో ఫిర్యాదుదారుతో మాట్లాడి చట్ట ప్రకారం సత్వర పరిష్కారం చూపాలని ఆదేశాలిచ్చారు. కుటుంబ సమస్యలకు సంబంధించి ఫిర్యాదుదారులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తగిన కౌన్సెలింగ్ కోసం పంపించాలని సూచించారు.

గోదారి గట్టుపై సెట్టేటి!



ఈ చెట్టుకు సెట్‌లో ఒక స్థానం ఉంది.. ఈ చెట్టు కింద సెట్ వేశారా.. ఆ సినిమా సూపర్ హిట్.. అందుకే ఈ చెట్టుకు మరో పేరుంది.. అదే సినిమా చెట్టు .. అందుకే ఈ చెట్టు కింద ఇప్పటి వరకూ సుమారు 300 చిత్రాలు తీశారు..ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చెట్టు సోమవారం నేల వాలింది.. సినిమా సెట్‌లో జ్ఞాపకంగా మారింది.

- మెయిన్‌లో

15న అన్న క్యాంటిన్ ప్రారంభం

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరులో అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 5: కొవ్వూరు బస్టాండ్ వద్ద ఈ నెల 15 నుంచి అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్ ఆధునీకరణ పనులను ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలతో సీఎం చంద్రబాబు రూ.5కే అన్నం పెట్టాలని అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని నిరుపయోగం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించి రూ.5కే అన్నం పెడతామని మాట ఇచ్చారని, దానిలో భాగంగా ఈ నెల 15న ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, డేగల రాము, గంగుమళ్ల స్వామి, పోలిశెట్టి శివ, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్ ఉన్నారు.

సూపర్‌ఫాస్ట్‌లకు నిడదవోలులో హాల్ట్ కల్పించండి



నిడదవోలులో రైల్వే అధికారికి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నిడదవోలు, ఆగస్టు 5: నిడదవోలు జంక్షన్ అమృత్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కార్యక్రమంలో ఉందని ఈ నేపథ్యంలో జన్మభూమి, లోకమాన్య తిలక్ వంటి సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ అన్నారు. సోమవారం నిడదవోలు రైల్వేస్టేషన్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్ట్ విషయమై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఇప్పటికే రైల్వే డీఆర్ఎమ్‌కు వినతిపత్రాలు అందజేశారన్నారు. నిడదవోలు జంక్షన్ అటు మెట్ట ఇటు డెల్టా ప్రాంతవాసులకు ఎంతో ముఖ్యమైనదని, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దేవన పాపారావు, మాట్ల దుర్గారావు, నీలం రామారావు, మంగతాయారు, కట్టుంగ అచ్చయ్య, తమ్మినీడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల దహనంతో ఇక్కట్లు..



డి.ముప్పవరం సమీపంలో దగ్ధమవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

నిడదవోలు, ఆగస్టు 5: మండలంలోని డి.ముప్పవరం గ్రామ సమీపంలో రోడ్ల పక్కన ప్లాస్టిక్ సంచుల తయారీదారులు వ్యర్థాలు, చెత్తను రోడ్ల పక్క వేసేయడంతో సోమవారం ఆకతాయిలు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగ రావడంతో ప్రయాణికులు ఇబ్బందిపడడంతో పాటు ఆ పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అక్కడున్న కొందరు నీరు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చాయి.

వర్గీకరణ ఫలాలను త్వరగా అందించాలి

కొవ్వూరు, ఆగస్టు 5: రాబోయే విద్య, ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ ఫలాలను త్వరగా అందించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ మండలంలోని తోగుమ్మి గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. వర్గీకరణ పోరాటంలో పాల్గొన్న గ్రామానికి చెందిన పౌరోజు జయరాజును సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగిపాడులో జనసేన సభ్యత్వ నమోదు



సాగిపాడులో జనసేనలో చేరిన కార్యకర్తలతో ఇన్‌చార్జి సువర్ణరాజు

గోపాలపురం, ఆగస్టు 5: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని బలోపేతానికి కృషి చేస్తానని నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. మండలంలోని సాగిపాడు గ్రామంలో దొండపూడి అధ్యక్షుడు షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30మంది యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సువర్ణరాజు మాట్లాడుతూ జనసేనాని ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో పోసిన గణపతి, వీరాస్వామి, మద్దాల కాశీవిశ్వనాథ సనారి, సత్యనారాయణ, దుర్గాదేవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, ఆగస్టు 5: కొవ్వూరు డివిజన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 4 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్‌కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షీరరామలింగేశ్వరస్వామికి ఎమ్మెల్యే ఆరిమిల్లి పూజలు



ఉండ్రాజవరం, ఆగస్టు 5: మండలంలోని పాలంగి గ్రామంలో క్షీరరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆలయార్చకులు రఘు ఆధ్వర్యంలో పూజలు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే ఎంట ఆలయ ఈవో ఎంవీ రామయ్య తదితరులున్నారు. స్థానిక కనక దుర్గమ్మను శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు నిడదవోలులో జాబ్ మేళా

నిడదవోలు, ఆగస్టు 5: నిడదవోలులోని ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు. బీఎస్సీ, ఎమ్మెస్సీ అర్హత గల అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో ఉదయం9 గంటలకు కళాశాల ప్రాంగణంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలు జేకేసీ కో ఆర్డినేటర్ బి.సౌజన్య 73866 30918 నెంబరులో సంప్రదించాలని కోరారు.

పుంత..చింత!

- ఆధునీకరణకు నోచుకోని పుంత రోడ్లు
- గత ఐదేళ్లూ నిధులు విడుదల చేయని వైసీపీ
- పంట తరలింపునకు దారిలేక ఇబ్బందులు







తీపర్రు–కాకరపర్రు పరిధిలో అధ్వానంగా ఉన్న పుంత రోడ్లు

పెరవలి, ఆగస్టు 5: నాలుగైదేళ్లుగా పుంత రోడ్లు నిర్లక్ష్యానికి గురి కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరవలి ప్రాంతంలో ధాన్యం, అరటి, కొబ్బరి, కూరగాయలు తదితర పంటలు పండిస్తుంటారు. పంటలకు కావాల్సిన ఎరువులు తీసుకు వెళ్లాలన్నా, పండిన ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించాలన్నా పుంత రోడ్లే ఆధారం. వర్షాకాలం నాలుగైదు మాసాల పాటు పుంత రోడ్లు బురదమయంగా ఉండి రవాణాకు వీలు లేకుండా ఉండడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కానూరు, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, ముక్కామల, ఖండవల్లి తదితర గ్రామాల పరిధిలో సుమారు పది వరకు పుంత రోడ్లు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వీటి అభివృద్ధికి రూపాయి కూడా నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడికక్కడ అధ్వానంగా మారాయి. రైతులు పండించిన పంటల ద్వారా ప్రభుత్వానికి లక్షలాది రూపాయలు మార్కెట్ కమిటీ పన్నులు ద్వారా వెళుతుంది. అయితే మార్కెట్ కమిటీల నుంచి గతంలో పుంత రోడ్లు అభివృద్ధికి నిధులు మంజూరు చేసేవారు. ఇటీవల కాలంలో వీటిని నిర్వీర్యం చేయడం, మార్కెట్ కమిటీ నిధులు వేరే అవసరాలకు మళ్లించడంతో పుంత రోడ్లను పట్టించుకున్న నాథుడే లేకుండా పోయాడు. ప్రస్తుతం ప్రభుత్వం పుంత రోడ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులు తరలించుకోవడానికి అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో జిల్లాలోనే కొండగుంటూరు ఫస్ట్

- జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు



కొండగుంటూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద హర్షం తెలుపుతున్న నాయకులు

దివాన్‌చెరువు, ఆగస్టు 5: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమాల్లో రాష్ట్రంలోనే తూర్పుగోదావరి జిల్లా మొదటిస్థానంలో ఉంటే జిల్లాలో కొండగుంటూరు ప్రథమస్థానంలో నిలిచిందని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాజానగరం మండలం కొండగుంటూరులో డప్పువాయిద్యాలతో కృష్ణమాదిగ ఫ్లెక్సీతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో కొండగుంటూరు మాదిగలు ఉత్సాహంగా పాల్గొని పలు సందర్భాల్లో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారన్నారు. కృష్ణ మాదిగ ఇచ్చిన ఉద్యమాల పిలుపు అందుకుని, పాటించిన గ్రామం కొండగుంటూరు అన్నారు. ఉద్యమనేత కృష్ణ మాదిగ దాదాపు 30 ఏళ్లుగా అవిశ్రాంతం పోరాడారని పలువురు కొనియాడారు. మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



సదస్సులో పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు

గోకవరం, ఆగస్టు5: షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులను సాధించాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం(ఏపీసీఎన్ఎఫ్) నిర్వాహకుడు వీఎస్ఆర్ నాయుడు రైతులకు సూచించారు. మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున గల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రసాయన పురుగుమందుల అవశేషాలు లేని పంటల సాగును ప్రోత్సహించే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రతీ రైతు పాటించాలన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ విత్తనం నుంచి విత్తనం వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చాన్నారు. బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, దశపత్ర కషాయం, నీమాస్త్రం తదితర కషాయాల తయారీని ప్రదర్శనగా నిర్వహించారు. నిరంతరం రసాయన రహిత సేద్యం చేపడితే జీవన సరళిలో మంచి మార్పులను గమనించవచ్చాన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు, ఏపీసీఎన్ఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

6 వేల కౌలు రైతు కార్డుల జారీ లక్ష్యం : ఏవో

ఉండ్రాజవరం, ఆగస్టు 5: మండలంలో 6వేల మంది కౌలురైతులకు కార్డులు అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు సోమవారం తెలిపారు. అలాగే వరదలు, వర్షం వల్ల సూర్యారావుపాలెం, కాల్దరి, పసలపూడి, దమ్మెన్ను, మోర్త, ఉండ్రాజవరం గ్రామాల్లో నష్టపోయిన పంటల వివరాలు సేకరిస్తున్నామన్నారు. పంట నష్టపోయిన రైతులు మరలా కొత్తనారు కొనుగోలు చేసుకుని నాట్లు వేస్తున్నట్టు చెప్పారు. మండలంలో కొన్ని గ్రామాల్లో వర్షం వల్ల రెండు, మూడు రోజులు వర్షపు నీటిలో మునిగి ఉంటే నీరు తీసిన తర్వాత సస్యరక్షణ చర్యల్లో భాగంగా ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి పంటలో వేయాలని వ్యవసాయాధికారి రైతులకు సూచించారు.

తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేష్టం



నల్లజర్లలో అవగాహన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది

నల్లజర్ల, ఆగస్టు 5: తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ నల్లజర్ల సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం నల్లజర్లలో గర్భిణులు, బాలింతలకు తల్లి పాల విలువలను తెలియజేశారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి 6నెలల వరకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రత్నకుమారి, శ్రీదేవి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈగా తిలక్‌కుమార్



ఎస్ఈ తిలక్‌కుమార్‌ను సత్కరిస్తున్న గొట్టిముక్కల అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈగా తిలక్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాజమహేంద్రవరంలో డీఈ, ఈఈగా సేవలందించిన తిలక్‌కుమార్ పదోన్నతిపై ఏపీఈపీడీసీఎల్ కార్పొరేషన్ మేనేజరుగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. అటుపై రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ రాజమహేంద్రవరం ఎస్ఈగా విధులు నిర్వహించిన టీవీఎస్ఎన్ మూర్తి పదోన్నతిపై సీజీఎంగా విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఎస్ఈ బాధ్యతలు స్వీకరించిన తిలక్‌కుమార్‌ను సోమవారం జిల్లా వినియోగదారుల మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజమహేంద్రవరంలో విశేషంగా సేవలందించిన తిలక్‌కుమార్ తిరిగి ఎస్ఈగా రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.33,500 అపహరణ

సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మోసానికి పాల్పడిన వ్యక్తి

కొవ్వూరు, ఆగస్టు 5: కొవ్వూరు మండలం పంగిడిలో ఏటీఎం కార్డు మార్చి మాయచేసి రూ.33,500 అపహరించారు. గ్రామానికి చెందిన జైళ్ల శాఖ రిటైర్డ్ ఉద్యోగి రేలంగి నారాయణరావు శనివారం స్థానిక ఏటీఎం వద్దకు వెళ్లాడు. సొమ్ము రాకపోవడంతో బయకు వచ్చాడు. అక్కడే పొంచి ఉన్న ఓ వ్యక్తి యూనియన్ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు వస్తున్నాయని చెప్పడంతో ఇద్దరూ అక్కడికి చేరుకున్నారు. ఆ వ్యక్తి.. నారాయణరావుకు సహకరిస్తున్నట్టు నటించి ఏటీఎంలో కార్డు పెట్టి బ్యాలెన్స్ ఎంత ఉందో చూశాడు. డబ్బులు తీయకుండా బ్యాలెన్స్ చూస్తున్నావేంటి అని ప్రశ్నించడంతో పొరపాటున విత్‌డ్రాకు బదులు బ్యాలెన్స్ బటన్ నొక్కానని చెప్పి మాయచేసి కార్డు మార్చివేసి డూప్లికేట్ కార్డును నారాయణరావుకు ఇచ్చాడు. ఆ కార్డుతో డబ్బులు డ్రా చేయగా ఎంతకి సొమ్ము రాకపోవడంతో బ్యాంకుకు వెళ్లమని చెప్పి ఆ వ్యక్తి మోటారుసైకిల్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయాడు. నారాయణరావు ఇంటికి వెళ్లిపోయిన కొద్దిసేపటికి చాగల్లు ఏటీఎం నుంచి రూ.20 వేలు, నిడదవోలులో రూ.10 వేలు, రూ.3,500 మూడు సార్లు డ్రా చేసినట్టు సెల్‌ఫోన్‌కి మెసేజ్ రావడంతో నారాయణరావు కొవ్వూరు రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. తన బ్యాంకు ఖాతాలో రూ.33,620 ఉండగా గుర్తుతెలియని వ్యక్తి తన ఏటీఎం కార్డు మార్చివేసి రూ.33,500 అపహరించినట్టు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తి తలపై టోపి పెట్టుకుని ముఖం కనిపించకుండా జాగ్రత్త పడినట్టు చెబుతున్నారు. ఏటీఎంలో లభించిన సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత

దేవరపల్లి, ఆగస్టు 5: మండలంలోని గొల్లగూడెంలో లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల, వృద్ధాశ్రమానికి 10 బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు ఆశ్రమ ఫౌండర్, చైర్మన్ కాగిత భాస్కరరావుకు అందజేశారు. కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనంతపురం ఎన్‌హెచ్ 5, 16 ఈ సైట్ సిబ్బంది భరత్, సత్యనారాయణ రంజిత్ అనీష్ కేకుకట్ చేశారు.

మాజీ ఎంపీ భరత్ నోరు అదుపులో పెట్టుకో..

టీడీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్‌రామ్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేకుంటే తీవ్రపరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి హెచ్చరించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్ 72వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన నాటి నుంచి భరత్‌రామ్‌కు మతి భ్రమించిందని, అందుకే అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. ఆదిరెడ్డి కుటుంబంపై చిట్‌ఫండ్ వ్యాపారం పేరుతోను, ఇతర సంబంధలేదని వాటితో కలిపి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రచార రథాలు తగులబెట్టుకుని అధికార పార్టీ పైకి నెట్టడం, పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయి ఇంకా ఆ వాసన పోక ఇష్టానుసారంగా మాట్లాడడం చేస్తున్నారని ఇక చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆర్యాపురం బ్యాంక్‌కు ఐదేళ్లుగా ఎన్నికలు లేకుండా చేసి అందులో భరత్‌రామ్ కనుసన్నల్లో చేసిన అవినీతిని బయటకు తీస్తున్నారని చెప్పారు. రూ.1.70 కోట్ల వరకు అక్రమాలు బ్యాంక్‌లో జరిగాయని వాటి లెక్కలు తేల్చుతామన్నారు. సమావేశంలో టీడీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చాపల చిన్నరాజు, బేసరి చిన్ని, మళ్ల వెంకట్రాజు, కరగాని వేణు, బంగారు నాగేశ్వరావు, బషీర్, సలీమ్ పాల్గొన్నారు.

ఇగ్నోలో భగవద్గీతలో పీజీ కోర్సు

వివిధ కోర్సుల్లో అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 5: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ద్వారా ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి భగవద్గీతలో పీజీ కోర్సు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రం సమన్వయకర్త ఎంఆర్ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, ఇగ్నోలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు అడ్మిషన్ల గడువును ఆగస్టు 14వ తేదీ వరకూ పొడిగించినట్టు తెలిపారు. వైద్య విద్యార్థులకు హెల్త్ అండ్ న్యూట్రీషన్ కోర్సు, లీగల్ ప్రాక్టీస్‌లో ఉన్నవారికి వివిధ చట్టాలకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు, ఉపాధ్యాయులకు అనువైన కోర్సులను ఇగ్నో అందిస్తున్నదని తెలిపారు. వీటితో పాటు ఎంబీఏ లో రెండు వినూత్నమైన కోర్సులు ప్రారంభించారని, ఇంజనీరింగ్ చేసిన వారికి ఉపాధి కల్పించే విధంగా ఈ కోర్సులు ఉంటాయని తెలిపారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలు చేయవచ్చని, ఒకటి రెగ్యులర్ మోడ్‌లోను, మరొకటి డిస్టెన్స్ లెర్నింగ్ లేదా ఆన్‌లైన్‌లోనూ చేయవచ్చని తెలిపారు. ఎంపిక చేసిన పలు కోర్సుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ ఉంటుందని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలపై దృష్టి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు



రాజమహేంద్రవరం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్యం, మహిళల హక్కులు, మౌలిక సదుపాయాల కల్పన, వివిధ పథకాలపై ప్రజలను చైతన్యం చేసే దిశలో భాగంగా హైకోర్టు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 15 లోపుగా క్షేత్రం స్థాయిలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన మహిళల హక్కులు, వారి ఆరోగ్య పరిరక్షణ, మానసిక రుగ్మతలు, వితంతువుల సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో రహదారి మార్గాలు సరిగాలేని కుగ్రామాల్లో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీనికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

నిర్ణీత సమయానికి ఫుడ్‌ప్లాజాలు మూసివేయాలి

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5: అర్బన్ ఫుడ్ ప్లాజా వద్ద గల షాపులను ప్రభుత్వ నిర్దేశించిన ప్రకారం ప్రతి రోజు రాత్రి 11గంటలకే మూసివేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. గత రాత్రి ఈట్‌స్ట్రీట్ షాపులను సందర్శించినట్టు ఆయన చెప్పారు. రాత్రి 11గంట తర్వాత షాపులు తెరచివుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్పొరేషన్ తెలియజేసిన నిబంధనల మేరకు వ్యాపారాలు నిర్వహించాలని, ఎటువంటి ఉల్లంఘనలు పనికిరావన్నారు. రాత్రి 11గంటలకు ఈట్‌స్ట్రీట్ ఫుడ్ ప్లాజా షాపులు మూసివేసేలా చూడాలని కార్పొరేషన్ సెక్యూరిటీ గార్డులను ఆదేశించారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

ధవళేశ్వరం, ఆగస్టు 5: భార్య తలపై రాయితో కొట్టి ఆమె మరణానికి కారణమైన భర్త ధనాల మహేష్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రాజమహేంద్రవరం సీటీఆర్ఐకు చెందిన యర్నాకుల శ్యామల(24), ధవళేశ్వరానికి చెందిన మహేష్ 2017లో ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి ఓ బాబు, పాప ఉన్నారు. బొమ్మూరులోని టిడ్కో గృహాల్లోనివాసం ఉంటున్నారు. కొంతకాలంగా వీరి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు పడుతుండడంతో చాలాసార్లు పెద్దలు నచ్చజెప్పి సమస్యను పరిష్కరించారు. శ్యామలపై అనుమానం పెంచుకున్న మహేష్, ఈ నెల 2వ తేదీ రాత్రి ఆమెతో గొడవపడి సిమ్మెంటు రాయితో తలపై కొట్టి పారిపోయాడు. తలపగిలి రక్తం వస్తుండడంతో చుట్టుపక్కల వారు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి ఆమె మృతిచెందింది. మృతురాలి తమ్ముడు మణికంఠ ఫిర్యాదుతో ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి సీఐ బి.తులసీదర్ దర్యాప్తు చేపట్టి నిందితుడు మహేష్‌ను బొమ్మూరు టిడ్కో గృహాల వద్ద అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

మునగాలలో ఏరువాక శాస్త్రవేత్తల పర్యటన

కోరుకొండ, ఆగస్టు 5: మునగాల, శ్రీరంగపట్నంలలో వరద ముంపు గురైన వరి పంటను సోమవారం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలించారు. జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. అధిక వర్షాలకు పంట నీట మునిగి పాడైపోయిన వరి పొలాల వద్దకు వెళ్ళి నీటిలో కుళ్ళిపోయిన వరి దుబ్బలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.వరదనీరు తీసిన తరువాత స్వల్పకాలిక రకాలైన ఎఫ్‌టీయూ 1153, ఎఫ్‌టీయూ1156 మంది రకాలను నేరుగా చల్లడం కానీ, నారుపెట్టి ఉంచుకోవడం కానీ చేయాలన్నారు.దీని ద్వారా సీజన్ నష్టపోకుండా చేసుకోవచ్చన్నారు.అదేవిదంగా పాక్షికంగా పంట నష్టపోయిన రైతులు వరద నీరు పూర్తిగా బయటకు పోయిన పక్షంలో ఎకరా వరి పొలంలో 25కిలోల యూరియా,25కిలోల పోటాష్‌వేసుకుంటే పంట త్వరగా కోలుకుంటుందన్నారు. ఈ క్షేత్ర పర్యటనలో ఆయన వెంట మండల వ్యవసాయాధికారిణి గౌరీదేవి, ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ మద్యం షాపు సిబ్బంది

నలుగురిపై శాశ్వత వేటు

బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వర్తించడంతో తొలగింపు

చాగల్లు డిపో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తరంగిణి

కొవ్వూరు, ఆగస్టు 5: ప్రభుత్వ మద్యం షాపులో బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వర్తించిన నలుగురు సిబ్బందిని శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్టు చాగల్లు డిపో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తరంగిణి తెలిపారు. కొవ్వూరు పెట్రోల్ బంకు వద్ద మద్యం దుకాణంలో ఈ నెల 4న ఎక్సైజ్ ఎస్ఐ వైవీవీ లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 79 మద్యం బాటిల్స్ స్టాక్‌లో రిజిష్టర్‌కు వ్యత్యాసం రావడంతో సేల్స్ సూపర్‌వైజర్ కె.సత్తిపండు, సేల్స్‌మేన్‌లు బి.రాహుల్, ఎస్.స్వామిలను ఎక్సైజ్ సూపరింటెండెంటు ఆదేశాల మేరకు తొలగించినట్టు చెప్పారు. అలాగే నెల 2వ తేదీ రాత్రి 9 గంటల తరువాత కొవ్వూరు బస్టాండ్ సెంటర్ మద్యం షాపులో విధులు నిర్వర్తిస్తున్న చిన్నబాబు పెట్రోల్ బంకు వద్ద ఉన్న మద్యం షాపులో నుంచి షాపు మూసివేసిన తరువాత బీరు బాటిల్స్ అట్టపెట్టెలో పెట్టుకుని బయటకు తీసుకురావడంపై సరైన వివరణ ఇవ్వకపోవడంతో విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్టు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	రాయన్,కల్కి
వై.స్క్రీన్2	శివం భజే
దేవిశ్రీ(గాయత్రి	బడ్డీ
అనన్య	తిరగబడరా సామీ
నిడదవోలు	
వీ మ్యాక్స్	బడ్డీ
రాధాకృష్ణ	రాయన్
శ్రీగణపతి	శివం భజే
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	శివం భజే
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	---
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---